జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 20

పక్షపత్రిక

అక్టోబర్ 16-31, 2012






## సురాజ్యం - ప్రతిజ్ఞలు, సత్యాగ్రహాలు





లోక్‌నాయక్ జేపీ 110వ జయంతి ఉత్సవాలలో డా॥ జేపీ



కూకట్‌పల్లిలో మంజీరా నీటి శంకుస్థాపన చేస్తున్న డా॥ జేపీ



కూకట్‌పల్లిలో మంజీరా నీటి సరఫరాని ప్రారంభిస్తున్న డా॥ జేపీ



డా॥ జేపీ సమక్షంలో పార్టీలో చేరిన యువత




కూకట్‌పల్లిలో సమావేశంలో డా॥ జయప్రకాష్ నారాయణ్



కూకట్‌పల్లిలో కార్యకర్తల సమావేశంలో డా॥ జయప్రకాష్ నారాయణ్

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 16-31, 2012

సంపుటి - 3 సంచిక - 20

## లోపలి పేజీల్లో...

మన ఊళ్లో సురాజ్య.................................. 5

జనాకర్షక పథకాల బలిపీఠంపై పాలన........... 8

పాత రాజకీయ వాసనల నుంచి
అరవింద్ కేజ్రీవాల్ బృందం బయటపడుతుందా?.10

మేం చరిత్రకు సరైన వైపు ఉన్నాం: జేపీ ........... 12

లాలూచీ అవినీతి అరికట్టే చట్టం తేవాలి......... 13

కొత్త లోకాయుక్త నియామకం దుస్సంప్రదాయం.14

సమాచార హక్కు చట్టం అమలుపై
లోకాసత్తా ఉద్యమసంస్థ సర్వే...................... 16

లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ దరఖాస్తు .................18

కార్మికగీతం గురించి................................ 20

పట్టణాలలో సురాజ్య ఉద్యమ నగారా............. 22

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# రాజ్య విధులు పట్టని ప్రభుత్వాలు

## సంపాదకీయం

ప్రజలు ప్రభువుల కోసం, ప్రభుత్వాల కోసం పుట్టుకొచ్చిన వారు కాదు. రాజ్యాలు, ప్రభుత్వాలు ప్రజలు సృష్టించుకున్నవే. అప్పటి ఉమ్మడి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నవే. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యవిధులు, రాజ్యాంగం లక్ష్యాలు మారుతూ వస్తున్నాయి. కొత్త లక్ష్యాలను పెట్టుకుంటున్నాయి. కొత్త వ్యవస్థల్ని రూపొందించుకుంటున్నాయి.

తొలినాళ్లలో రాజ్యవ్యవస్థ కేవలం ప్రజల రక్షణ కోసం పుట్టింది. బయటి నుండి జరిగే దురాక్రమణల్ని ఎదుర్కొనడం, ప్రజల ధన,మాన,ప్రాణ రక్షణ కల్పించడం లక్ష్యం అయింది. బడితె వున్న వాడిదే బర్రె అన్న ఆటవిక న్యాయం సాగకుండా అందరికీ న్యాయాన్ని అందించడం అందులో భాగం అయింది. ఇలా ప్రారంభమైన రాజ్యవిధుల సుదీర్ఘప్రయాణం తర్వాత ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాల విధులకు ప్రస్థానం చేసింది.

ఈ మార్పులన్నీ ప్రజలు సాధించుకున్నవే తప్ప ప్రభువులు పాలకులు తెచ్చిపెట్టినవి కావు. ఈ క్రమంలో రాజ్యవ్యవస్థ నిర్వహించాల్సిన మౌలిక విధులను నిర్దిష్టపరుచుకోవడం జరిగింది.

ప్రథమ విధి : ప్రజలకు రక్షణ కల్పించడం రాజ్యానికి, ప్రభుత్వాలకి నాటికీ నేటికీ ప్రథమ విధిగా ఉంది. రక్షణ అంటే దురాక్రమణల నుండి రక్షణ - అంతర్గతంగా ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ. దీనితో పాటు బలవంతుల ఆటవిక న్యాయం సాగకుండా ప్రజలకి న్యాయం జరిగే ఏర్పాటు అంటే చట్టబద్ధపాలన అందించడం ఇది ప్రప్రథమ కర్తవ్యం.

ద్వితీయ విధి : సమాజ పురోగతికి దోహదం చేసే మౌలిక సదుపాయాల కల్పన మరో కర్తవ్యం అయింది. బావులు తవ్వించడం, చెరువులు నిర్మించడం, కాలి బాటలు వెయ్యడంతో ప్రారంభమై ఇప్పుడు రవాణా-విద్యుత్తు-కమ్యూనికేషన్లు విస్తరింపజెయ్యడం అన్నది రాజ్యం నిర్వర్తించాల్సిన కీలకమైన మరో విధిగా రూపొందింది.

ఇవి లేకుండా అభివృద్ధి వుండదు- అందరికీ ఉపాధి వుండదు, పేదరికం తొలగిపోదు.

తృతీయ విధి : అభివృద్ధిని వేగవంతం చెయ్యడానికి తగిన మానవాభివృద్ధి సాధించడం రాజ్యవ్యవస్థ లక్ష్యం అయింది. పుట్టిన ప్రతి బిడ్డకీ డబ్బుతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాల చదువు-అందరికీ మంచి ప్రమాణాల వైద్య ఆరోగ్య సేవలు అందించడం- స్వతంత్ర జీవనానికి ఎదిగే అవకాశాలు కల్పించడం రాజ్యవిధులలో భాగం అయింది.

చతుర్ధవిధి : సమాజం మీద ఆధారపడిన వారికి రాజ్యవ్యవస్థ తగిన జీవన భద్రత కల్పించాలి. వారి సంక్షేమాన్ని పట్టించుకోవాలి. ఎలాంటి ఆధారం లేకుండా వృద్ధాప్యంలో వున్నవారు, అంగవైకల్యంతో ఇతరుల మీద ఆధారపడివున్నవారు, యుద్ధాలు ప్రకృతిభీభత్సాలతో అనాధలైనవారు, కరువుకాటకాలతో తిండిలేక అలమటించే వారు... ఇలా సమాజం ఆదుకోవలసిన వారికి ప్రభుత్వాలు తగిన జీవన భద్రత కల్పించాలి.

మన దేశంలో రాజకీయం ఈ రాజ్యవ్యవస్థ విధులలో ప్రాధాన్యతల్ని విస్మరించింది. వాటిని సమర్ధవంతంగా నిర్వహించడంలో వైఫల్యం చెందింది. ఇలాంటి అంశాల మీద జరగాల్సిన రాజకీయ చర్చ కేవలం ఓట్లు, సీట్ల చుట్టూ తిరుగుతూ దారితప్పింది. అవినీతి, ఓటు బ్యాంకు రాజకీయం తప్ప మరో ఆలోచన కలగనివ్వడం లేదు. రాయితీల చుట్టూ ప్రజలను తిప్పుతూ ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. మౌలిక విధుల మీద దృష్టి సారించాలి. ప్రజల ఆకాంక్షల్ని పెంచాలి. అందరికీ ఎదిగే అవకాశాలను ఇచ్చే సుపరిపాలన లక్ష్యంగా సురాజ్య ఉద్యమం సాగాలి. ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

***ఫోన్ నంబర్లు :***
***040- 23311817, 23311819, 23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మన ఊళ్లో సురాజ్యం

## కార్యక్రమాల నిర్వహణకు కొన్ని మార్గదర్శకాలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్
సురాజ్యఉద్యమ కమిటీ కన్వీనర్

**పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీల అధ్యక్షులకు, కన్వీనర్లకు**

### I 1. అక్టోబర్ 30న - ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటు (మున్సిపల్ పౌరవేదికలు)

ప్రస్తుతం మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధుల పాలన లేదు. ఎన్నికలు ఇప్పుడు జరిగే అవకాశమూ లేదు. ప్రజా సమస్యలు పట్టించుకునే ప్రజాప్రతినిధులు లేనందున సురాజ్య కమిటీ చొరవ తీసుకుని ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చెయ్యాలి.

**ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఛైర్మన్ మరియు అధ్యక్షవర్గం**

– సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌కు ఒక ఛైర్మన్‌తో పాటు అధ్యక్ష వర్గానికి పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీ అధ్యక్షులతో పాటు మరో నలుగురైదుగురు పెద్దలను గుర్తించి, వారితో సంప్రదించి తుది జాబితాను రూపొందించుకోవాలి. ఇందులో మహిళలకు, ఇతర తరగతులకు ప్రాతినిధ్యం వుండేలా చూడండి.

**ఆహ్వానిత సభ్యులు :** ఈ ప్రజాకౌన్సిలుకు మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లను, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను మాజీ మున్సిపల్ కమిషనర్లు లేదా ఇంజనీర్లు, మేనేజర్ల వంటి వారిని ఆహ్వానిత సభ్యులుగా పెట్టుకోవాలి.

**ప్రజాకౌన్సిలర్లు :** ప్రతి వార్డుకీ ఇద్దరు సభ్యులు అందులో ఒకరు మహిళ వుండేలా ప్రజా కౌన్సిలర్లను ఏర్పాటు చేసుకోవాలి. ఆయా వార్డులలో స్థానిక సమస్యల మీద కృషి చేస్తున్న వారు, లేదా పని చెయ్యాలన్న ఆసక్తి గలవారి నుండి ఎంపిక చెయ్యాలి.

**ప్రజాగేలరీ :** మున్సిపల్ వ్యవహారాలలో ఆసక్తిగల వారిని వివిధ రంగాల ప్రతినిధుల్ని ప్రతి సమావేశానికి ప్రజాగేలరీకి ఆహ్వానితులుగా పిలుచుకోవాలి.

ప్రజాకౌన్సిల్ ఏర్పాటు తేదీని, ప్రదేశాన్ని ముందుగా నిర్ణయించి కరపత్రం ద్వారా ప్రచారం చేసి, అందరికీ ఆహ్వానాలు పంపి తొలి ప్రజాకౌన్సిల్ సమావేశం నిర్వహించి లాంఛనంగా ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ పేర్లు ప్రకటించాలి. ఈ ప్రజాకౌన్సిల్ బృందాన్ని రాజకీయాలకి అతీతంగా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న లేదా ఆసక్తిగల వారితో ఏర్పాటు చెయ్యాలి.

### 2. ప్రజా మున్సిపల్ కౌన్సిలు నిర్వహించే కార్యకలాపాలు

1. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం కావాలి.

ఉదా: ప్రతినెలా 1–15 తేదీలు లేదా మరొక తేదీలు నిర్దిష్టంగా నిర్ణయించి ప్రకటించాలి.

2. ప్రతి సమావేశంలో కనీసం ఈ క్రింది మూడు అంశాలతో ఎజెండాను రూపొందించుకోవాలి.

   1. మున్సిపాలిటీల సాధికారత సమస్యలు (74 రాజ్యాంగ సవరణలోని ఒక అంశంపై వివరణ – చర్చ)
   2. మన ఊళ్లో వసతులు, మానవాభివృద్ధి, సిటిజన్స్ ఛార్టర్లలో ఏదో ఒక అంశంపై నివేదిక – చర్చ
   3. ప్రజా కౌన్సిలర్లు తమ వార్డులలో సమస్యల ప్రస్తావనలు, విజ్ఞప్తులు

3. సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల్ని క్రోడీకరించి స్థానిక మున్సిపల్ అధికారులతో ఆ సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలి.

ముఖ్యమైన సమస్యలు వెలుగులోకి తేవడానికి మున్సిపల్ ఛైర్మన్, అధ్యక్ష బృందం, ప్రజా కౌన్సిలర్లు ఆయా ప్రాంతంలో క్షేత్రసందర్శనలు చెయ్యాలి.

4. ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు, ఎజెండా రూపొందించడానికి, చర్చకు వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించడానికి, మెమోరాండాలు రూపొందించడానికి, క్షేత్ర సందర్శన ఏర్పాట్లు చెయ్యడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. కొంత అనుభవం గల వారిని దీనికి కన్వీనరుగా పెట్టి ఈ కార్యక్రమం సజావుగా జరగడానికి ఏర్పాట్లు చెయ్యాలి.

**అక్టోబరు 15-20 వరకు మన ఊళ్లో సురాజ్యంపై కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం, పట్టణ కూడళ్ళలో సురాజ్యం ఫ్లెక్సీలు**

**అక్టోబరు 25 వరకు తొలిదశ వలంటీర్ల నమోదు**

**వలంటీర్ల ఆసక్తినిబట్టి 5 బృందాలుగా ఏర్పాటు**

**బృందాలవారీగా వేర్వేరు శిక్షణ - గైడ్ చెయ్యగల వారితో నిర్దిష్టంగా బృందాల ఏర్పాటు**

## II నవంబర్ 8వ తేదీ - జన లోక్‌పాల్ ఏర్పాటు

### (మన ఊళ్లో అవినీతి)

1. సురాజ్య ఉద్యమకమిటీ సమావేశమైన పట్టణానికి ఒక జన లోక్‌పాల్ ను ఏర్పాటు చెయ్యాలి. ఇందులో 10, 11 మందిని సభ్యులుగా చేసుకోవచ్చును.
రిటైర్డ్ జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు, రిటైర్డ్ పోలీసు ఉద్యోగులను భాగస్వాములను చెయ్యాలి.
వీరిలో ఒకరిని జన లోక్‌పాల్ అధ్యక్షులుగా మిగిలిన వారిని న్యాయబృందంగా ప్రకటించాలి.

2. జన లోక్‌పాల్ ప్రతి 15 రోజులకు సమావేశం అవుతుంది. (ఒక వారంలో ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగితే మరో వారంలో జన లోక్‌పాల్ సమావేశం జరిగేలా తేదీలు నిర్ణయించుకోవాలి.)
ప్రభుత్వ సేవలు, పథకాలు, ఇతరత్రా అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తుంది. ఈ సమావేశంలో వాటిపై ఫిర్యాదులను వింటుంది. అవసరమయితే బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. ప్రాథమిక సాక్ష్యాధారాలున్న కేసులను నిర్ధారించి సంబంధిత నేర పరిశోధన విభాగాలకు, అధికారులకు తగిన చర్యలు నిమిత్తం పంపిస్తుంది. బాధితులకు సత్వరన్యాయం జరిగేలా సంప్రదింపులు జరుపుతుంది.

3. జన లోక్‌పాల్ బృందానికి తోడ్పాటునివ్వడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి ప్రజా ఫిర్యాదుల సేకరణకు, విచారణకు, తదుపరి చర్యలకు జన లోక్‌పాల్ తోడ్పాటునిస్తుంది.

## III ముఖ్యమైన ఇతర బృందాలు

**1. మన ఊళ్లో పౌర వసతులు :** సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై దీనికి ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, లైట్లు పరిస్థితిపై ఆయా వార్డు ప్రజా కౌన్సిలర్ల తోడ్పాటుతో సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణం స్పందించాల్సిన సమస్యలను సురాజ్య ఉద్యమ కమిటీ దృష్టికి తేవాలి. ప్రతి వార్డు స్థాయిలో 1000 రూపాయల తలసరి గ్రాంటు ఆధారంగా ఒక సూక్ష్మ ప్రణాళికను స్థానికుల భాగస్వామ్యంతో రూపొందించాలి. ప్రజా ఫిర్యాదుల బాక్స్‌లను ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేసి ప్రతి రోజు వాటిని సేకరించి తగు చర్యలు నిమిత్తం మున్సిపాలిటీకి నివేదించే ఏర్పాటు చేసుకోవాలి.

**2. మన ఊళ్లో పౌరసేవలు :** సురాజ్య కమిటీ ఏర్పాటు చేసే ఈ బృందం సిటిజన్స్ ఛార్టర్ల అమలు కోసం కృషి చెయ్యాలి. వీలైన పట్టణాలలో పౌరసేవాకేంద్రాన్ని ఏర్పాటు చెయ్యాలి. అలాగే మున్సిపాలిటీకి సంబంధించి సమాచార హక్కు చట్టం ప్రకారం విధిగా వెల్లడించాల్సిన అంశాలు అందరికీ అందుబాటులోకి తేవాలి.

సకాలంలో ఫిర్యాదులు పరిష్కారం, సమాచారం అందించినపుడు మున్సిపల్ కమిషనర్‌నీ, బాధ్యులైన సిబ్బందినీ పూల గుచ్ఛాలతో సత్కరించండి. సకాలంలో సేవలు అందించకపోతే అందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించండి. ఈ కార్యకలాపాలు సురాజ్య కమిటీ ఆమోదంతో నిర్వహించాలి.

**3. మన ఊళ్లో మానవాభివృద్ధి :** దీని కోసం సురాజ్య కమిటీ ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని రూపొందించాలి. ఈ బృందం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో సిబ్బంది, వసతుల కొరతలపై సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందిస్తుంది. సురాజ్య కమిటీ ఈ సమస్య పరిష్కారానికి తగిన మెమోరాండాలు, సంబంధిత అధికారులతో చర్చలు సాగించాలి.
అలాగే ఈ బృందం ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు, అంగన్‌వాడీల మీద సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణ సమస్యలపై సురాజ్య కమిటీ స్పందించాలి.
యువతకు ఉపాధి పథకాల అమలు శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్ల పై సర్వే నిర్వహించాలి. యువతతో ప్రత్యేక రౌండ్‌టేబుల్స్ నిర్వహించి ఈ అంశాలను చర్చించాలి. పథకాలలో అవినీతి వుంటే దానిని "జన లోకాయుక్తకు" నివేదించాలి.

ఇవన్నీ సురాజ్యం పేరుతో నిరంతరాయంగా సాగించాల్సిన కార్యక్రమాలు. దీనికి వలంటీర్లు, శిక్షణ అవసరం అందుకు విస్తృత ప్రచారం చెయ్యాలి. ప్రతి కాలేజీలో, ప్రతి పౌరసేవా సంస్థలో వలంటీర్ల నమోదుకు ఏర్పాట్లు చెయ్యాలి. వలంటీర్లను పైన పేర్కొన్న విధంగా ఐదు బృందాలు చేసి వారికి నిర్దిష్టంగా కార్యక్రమాలను అప్పగించాలి.

**మన ఊళ్లో సురాజ్యం మార్చ్– విద్యార్థులతో ప్రచార కార్యక్రమం 'క్లీన్ దే' నవంబర్ 24 నుండి 26 వరకు (స్థానిక సభ్యులకు అనుకూలంగా వున్న ఒకరోజు జరుపుకోవచ్చు)**

## IV సురాజ్య నిధి - ఇతర వసతులు

స్థానికంగా ప్రచారానికి, సభలు సమావేశాల నిర్వహణకీ అవసరమైన నిధులను సురాజ్య కమిటీ సేకరించాలి. సురాజ్య కమిటీ, ప్రజా మున్సిపల్ కౌన్సిల్, జన లోకాయుక్తలలోని సభ్యుల నుంచి ఎంతో కొంత మొత్తం అడిగి తీసుకోవాలి. సురాజ్యఉద్యమానికి తోడ్పాటునిచ్చే దాతల నుండి ప్రతి పట్టణంలో నిధులు సేకరించుకోవాలి. వీటి జమాఖర్చుల నిర్వహణకు కోశాధికారిని ఏర్పాటు చేసుకోవాలి. జమాఖర్చులు ప్రతి సురాజ్య కమిటీ సమావేశంలో ప్రకటించాలి.

## V సురాజ్య ఉద్యమంలో యువతని, మహిళలనీ, భాగస్వాములను చెయ్యడానికి ప్రత్యేక చర్చలు

**1. విద్యార్థులు, యువతతో రౌండ్‌టేబుల్** : వివిధ కాలేజీల నుండి విద్యార్థులను, వివిధ యువజన సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి ఒక రౌండ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా నిర్వహించి వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి.

**2. మహిళా రౌండ్‌టేబుల్** : మహిళా టీచర్లు, లాయర్లు, డాక్టర్లు – మహిళాసంస్థలు– పొదుపు సంఘాల నాయకులను ఆహ్వానించి మహిళలకు ఒక ప్రత్యేక రౌండ్‌టేబుల్‌ను నిర్వహించి – ఇందులో వలంటీర్ల నమోదు – వివిధ కార్యకలాపాల బృందాలలో ఆసక్తిగల వారికి బాధ్యతలు అప్పగించాలి – ప్రజా వార్డు కౌన్సిలర్లుగా ఆసక్తి వున్నవారిని గుర్తించి వారికి అవకాశం కల్పించాలి.

**సురాజ్య కమిటీ ప్రతివారం సమావేశమై ఈ కార్యకలాపాలను సమన్వయం చెయ్యాలి.**

మన ఊళ్లో సురాజ్యం ఉద్యమాన్ని మొత్తంగా సురాజ్య ఉద్యమ కమిటీయే సమన్వయం చేసి నిర్వహించాలి. అందుచేత ఇతర కమిటీలలో, వేరే వారికి ప్రాతినిధ్యం కల్పించండి. ఒకరిద్దరే అన్ని బాధ్యతలు నిర్వహించే పద్ధతి ఉండకూడదు. దీనిని విధిగా పాటించండి. ■

### సురాజ్య సమావేశాల వసతులకు విజ్ఞప్తి

**సురాజ్య కార్యకలాపాల కోసం లయన్స్, రోటరీ, మెడికల్ అసోసియేషన్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఇతర సంస్థలకు వున్న వసతులను, హాల్స్‌ను వీటికి ఉచితంగా ఇచ్చేలా వారిని కలిసి ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కరపత్రాలు, ఫ్లెక్సీలు వగైరాలకు స్పాన్సర్లను ఏర్పాటు చేసుకోవాలి.**

## సురాజ్యం కేలండర్

| తేది | కార్యక్రమాలు |
|---|---|
| అక్టోబరు 15–25 | మన ఊళ్లో సురాజ్యంపై కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం, పట్టణ కూడళ్లలో సురాజ్యం ఫ్లెక్సీలు<br>యువత, విద్యార్థులతో రౌండ్‌టేబుల్స్ – మహిళలతో రౌండ్‌టేబుల్స్<br>తొలిదశ వలంటీర్ల నమోదు పూర్తి – ఐదు బృందాలుగా ఏర్పాటు |
| అక్టోబరు 25–30 | వలంటీర్ల బృందాలకు శిక్షణ |
| అక్టోబరు 30 | ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటు |
| నవంబర్ 8 | పట్టణ జన లోకాయుక్తల ఏర్పాటు |
| నవంబర్ 9–18 | ఏదో ఒకరోజు పట్టణాల్లో సురాజ్యం 'మార్చ్' – విద్యార్థులతో ప్రచార కార్యక్రమం |
| నవంబర్ 24–26 | ఏదో ఒకరోజు 'క్లీన్ సిటీ దే' విద్యార్థులతో సురాజ్యం కోసం స్వయంకృషి |

# జనాకర్షక పథకాల బలిపీఠంపై పాలన

-డా॥ జయప్రకాష్ నారాయణ్

భారతదేశవ్యాప్తంగా 60లక్షలమంది నివాసితులకు ఉచితంగా మొబైల్ ఫోన్లు ఇవ్వాలని ఇటీవల యూపీయే ప్రభుత్వం ఓ ఆలోచన చేసినట్టు విశ్వసనీయ వార్తలు వచ్చాయి. ఉచితాల సంస్కృతి మన రాజకీయాల్ని ఎంతలా పెనవేసుకుపోయిందో మరోమారు స్పష్టంగా కళ్లకు కట్టే ఉదాహరణ ఇది.

ఉత్తరప్రదేశ్‌లో, ఓటర్లకు అన్నిరకాల తాత్కాలిక తాయిలాల్ని ఇవ్వటానికి రాజకీయ పార్టీలు పోటాపోటీగా కలబడ్డాయి. తమిళనాడులో, డి.ఎం.కె, అన్నా డి.ఎం.కెల పోటాపోటీ జనాకర్షక రాజకీయాలు నివ్వెరపరిచే స్థాయిలో ఉన్నాయి. బ్లెండర్, సీలింగ్ ఫ్యాను, వాషింగ్ మెషీన్, గ్యాస్ స్టవ్, కలర్ టి.వి, ల్యాప్‌టాప్, ఆహారధాన్యాలు, బంగారం– ఇలా కాదేదీ అక్కడ ఉచితానికి అనర్హం. ఆంధ్రప్రదేశ్‌లో, రూ. 2లకు కిలో బియ్యాన్ని రాష్ట్రంలోని 2కోట్లకంటే ఎక్కువ కుటుంబాలకు ఇస్తానని హామీ ఇచ్చి వై.ఎస్ రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చారు.

రాష్ట్రాలలో, జాతీయస్థాయిలో కూడా చాలా బాధ్యతారహితమైన, నిర్లక్ష్యపూరితమైన జనాకర్షక పథకాల సంస్కృతి రాజకీయ పార్టీలలో ప్రబలిపోయింది. 'పాలన= దోపిడీ+ జనాకర్షక పథకాలు' గా మారకముందే మనం ఈ పంథాను జాగ్రత్తగా అర్థంచేసుకుని, తగిన దిద్దుబాటు చర్యల్ని చేపట్టాలి.

ప్రభుత్వాల పట్ల ప్రజలలో తిరస్కారభావన, ఉదాసీనత పెరిగిపోతుండటంతో ఓటర్లను ఆకర్షించటానికి పార్టీలు డబ్బు, మద్యంను వెదజల్లటం ప్రారంభించాయి. అన్ని సాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీలూ ఓట్లను కొనుగోలు చేస్తుండటంతో, సీరియస్‌గా ఎన్నికలలో పోటీచేయాలనుకునే వారు పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయటం ఒక ప్రవేశరుసుంలాగా మారిపోయింది. దీనివల్ల సామర్థ్యం, నిజాయతీ గల పౌరులు రాజకీయాలలోకి రావటం కష్టమైపోయింది. భారీగా డబ్బు ఖర్చు పెట్టగలిగినవారు మాత్రమే రాజకీయాలలోకి రావటానికి ఇదో అవకాశంగా మారింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలలో ఒక్కో అసెంబ్లీ స్థానానికి రూ. 5–10కోట్లు ఖర్చు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. భారీగా డబ్బు వెదజల్లినంత మాత్రాన



గెలుపునకు గ్యారంటీ లేదు కానీ, డబ్బు ఖర్చు పెట్టకపోతే మాత్రం ఓటమి తథ్యం.

దీనికితోడు, పేద ఓటర్లను ఆకట్టుకోవటానికి రాజకీయపార్టీలు ప్రజాధనాన్ని కూడా విచక్షణారహితంగా ఉచితాలు, రాయితీల కోసం ఖర్చు చేయటం ప్రారంభించాయి. ఇందిరాగాంధీతో మొదలైన ఈ సంస్కృతి ఎం.జి.ఆర్, ఎన్.టి.ఆర్‌లకు, సదరు ఇతర జనాకర్షక నేతలకు పాకింది. వైఎస్ఆర్ ఆ జనాకర్షక సంస్కృతిని పరాకాష్ఠకు తీసుకెళ్లారు.

'సంక్షేమాన్ని' పెంపొందించటం తమ చట్టబద్ధ బాధ్యత అని పార్టీలు వాదిస్తుంటాయి. పేదలకు మేలుచేసే పథకాలను చేపట్టే హక్కు వాటికి ఉందనటంలో సందేహం లేదు. కానీ ఆ పార్టీలు చేస్తున్నది పైకి చాలా ఆకర్షణీయంగా కనిపించే ఓ మభ్యపెట్టే వాదన. ప్రభుత్వం చేయాల్సిన మొదటి బాధ్యత- పౌరులను పరిరక్షించేందుకు శాంతిభద్రతల్ని కాపాడటం, న్యాయాన్ని అందించటం, చట్టబద్ధ పాలనను అమలుచేయటం. రెండోది, ఉమ్మడి అవసరాలకు సౌకర్యాలను, రవాణా, విద్యుత్, నీరు తదితర రంగాలలో మౌలిక సదుపాయాలను కల్పించటం. మూడోది, నాణ్యమైన విద్య, ఆరోగ్యాన్ని అందించటం. ఈ సేవల్ని ప్రభుత్వం నెరవేర్చకపోతే, నాగరికతకు, ప్రజాస్వామ్యానికి అవమానకరమైనరీతిలో ఒక బిడ్డ భవిష్యత్తును పుట్టుక, సామాజిక స్థాయి మాత్రమే నిర్ణయిస్తాయి. పేదరికం నిరంతరం కొనసాగుతుంటుంది. శాంతిభద్రతల పరిరక్షణ, మౌలికవసతుల నిర్మాణం, మానవాభివృద్ధి విషయంలో ప్రభుత్వం తన బాధ్యతల్ని నెరవేర్చాక, ఇంకా దుర్భర పరిస్థితుల నుంచి బైటపడలేని వారికి ప్రత్యేక సహాయాన్ని అందించటానికి సంక్షేమ పథకాలు అవసరమవుతాయి.

కానీ, ఈవేళ విచారకరమైన పరిస్థితి ఏమంటే, పార్టీలు తమ ప్రాథమిక కర్తవ్యాల్ని విస్మరించేస్థాయిలో సోమరిపోతు, విచక్షణారహిత సంస్కృతిలో కూరుకుపోయాయి. పోటాపోటీ ఉచితాలతో ఓటుబ్యాంకులను నిర్మించుకుంటున్నాయి. చట్టబద్ధపాలన, శాంతిభద్రతలు ఛిన్నాభిన్నమై పోయాయి. బడితె ఉన్నవాడిదే బర్రె తరహాలో బలమున్న వాళ్లు చెలాయించటం మామూలై పోయింది. మన రవాణా, విద్యుత్ మౌలికవసతులు ఆర్థికవ్యవస్థకు మోయలేని భారంగా మారాయి. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విద్యారంగంలో నాణ్యతాప్రమాణాలపై జరిపిన సర్వేలో 74 ఎంటిటీలలో భారతదేశానికి 73వ స్థానం వచ్చింది. అట్టడుగు నుంచి రెండో స్థానంలో మనమున్నాం. ప్రపంచంలోని అన్ని పెద్ద ఆర్థికవ్యవస్థలోకీ మన వైద్యారోగ్య వ్యవస్థ అథమంగా ఉంది. కానీ ఉచితాల రేసులో మాత్రం మనం బహుశా భూమండలంలోని అన్ని దేశాలనూ అధిగమించేశాం.

అన్ని సాంప్రదాయ పార్టీలూ ఇందులో దోషులే. యూపీయే ప్రభుత్వం మినహాయింపు కాదు. రుణమాఫీలు, ఇప్పుడు ఉచిత సెల్‌ఫోన్లు, మానవవనరుల కొరత ఉన్న చోట కూడా ఉపాధి హామీ పథకం అమలు, పెట్రోల్, వంటగ్యాస్, కిరోసిన్ రాయితీలు మాఫియా వ్యవస్థలకు దారితీయటం- ఇవన్నీ కేంద్రప్రభుత్వ తప్పిదాలే.

ఓట్ల కోసం జరుగుతున్న ఈ వెర్రి పోటీలో ప్రజల్ని కేవలం ఓటుబ్యాంకులుగా మాత్రమే పరిగణిస్తున్నారు. సమాజంలో పేదరికాన్ని, ఆధారపడటాన్ని, యాచించటాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారు. నిజంగా తమ జీవితాలకవసరమైన సేవల్ని అందించే సత్తాగానీ, చిత్తశుద్ధిగానీ ప్రభుత్వాలకు ఉందనే విశ్వాసాన్ని ఓటర్లు కోల్పోయారు. ఏ ప్రజాస్వామ్యంలోనైనా, స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనానికి, దీర్ఘకాలిక ప్రజాప్రయోజనాల సాధనకు మధ్య సంఘర్షణ ఉంటుంది. విజ్ఞులైన నాయకులు స్వల్పకాలిక ప్రయోజనాలను, దీర్ఘకాలిక ప్రయోజనాలతో సమన్వయం చేసుకుంటారు. కానీ మన పార్టీలు విజ్ఞతను, నైతిక సాధికారతను, నాయకత్వాన్ని కోల్పోయి వెన్నెముక లేకుండా గాలివాటంగా ప్రయాణిస్తున్నాయి.

ఇప్పుడు ఏమిటి పరిష్కారం? మనం అధికారాన్ని వికేంద్రీకరించాలి. వికేంద్రీకరణ వల్ల తాము చెల్లించే పన్నులకు, తమకు ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలకు మధ్య సంబంధం ప్రజలకు అర్థమవుతుంది. అందుబాటులో ఉన్న పరిమితవనరులను తమ అపరిమిత అవసరాలకు ఎలా సవ్యంగా వినియోగించుకోవాలో వారు అర్థం చేసుకుని, అందుకు అవసరమైన కఠిననిర్ణయాలు తీసుకోగలుగుతారు. కేంద్రీకృత పాలన వల్ల బాధ్యతారాహిత్యం, జనాకర్షక ధోరణులు పెచ్చరిల్లిపోతున్నాయి. ప్రభుత్వం ఏయే పనులు చేయాలి, ఏది ముందు, ఏది తర్వాత చేయాలి అనే అంశంపై ఒక స్థూల ఏకాభిప్రాయానికి రావాలి. జనాకర్షక పథకాల కంటే మౌలికవసతుల నిర్మాణం, మానవాభివృద్ధి ప్రభుత్వానికి తొలి ప్రాథమ్యం కావాలి. దాంతోపాటు, మనం ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థను మార్చుకుని దామాషా ఎన్నికల పద్ధతి వంటి మెరుగైన ఎన్నికల విధానానికి మళ్లవలసి ఉంది. ఎన్నికల విధానంలో ఈ మార్పు వస్తే, కేవలం కొన్ని ఓట్లు ఎక్కువ రాకపోవటం వల్ల ఓడిపోతామనే భయం పార్టీలకు ఉండదు కాబట్టి, ప్రజలకు స్వతంత్ర జీవనం అందించే దిశగా సరైన, దీర్ఘకాలికమైన విధానాలను అనుసరించగలుగుతాయి. నిజాయతీపరులు, సమర్థులు రాజకీయాలలోకి రాగలుగుతారు. ■

('తెహల్కా' వీక్లీ న్యూస్‌మ్యాగజైన్ సౌజన్యంతో)

# పాతరాజకీయ వాసనల నుంచి అరవింద్ కేజ్రీవాల్ బృందం బైటపడుతుందా?

భారతదేశ ప్రజలమైన మనం, మన ప్రతినిధులుగా, మన పాలకులుగా ఎన్నికలలో నేతల, సంపన్నుల కొడుకులని, కూతుళ్లని, అల్లుళ్లని, మనవళ్లని, బంధువుల్ని గెలిపిస్తూ వీఐపీ సంస్కృతికే పట్టం గడుతున్నాం. ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా వ్యవహరించాల్సిన ప్రజలే బానిసత్వ భావాలతో వ్యవహరిస్తుండటంతో అధికారగణం, దిగువస్థాయి రాజకీయవర్గాలు కూడా అలాగే వీఐపీల సేవలోనే తరిస్తూ తమ వంతు వాటాలు దండుకుంటున్నారు. ఈ వాతావరణం నుంచే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా అనే వ్యక్తి అప్పనంగా ఎదిగిపోయారు. ఆయనకు, కాంగ్రెస్ పార్టీకి, కేంద్రప్రభుత్వానికీ సాంకేతికంగా ఏ సంబంధం లేకపోయినా భారతదేశంలోని అత్యంత శక్తివంతమైన కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగా సకల లాంఛనాల్ని, మర్యాదల్నీ అనుభవిస్తూ వస్తున్నారాయన. రాజకీయ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు గాంధీ జయంతిరోజున ప్రకటించిన సామాజిక ఉద్యమకారుడు అరవింద్ కేజ్రీవాల్ ప్రజలలో ప్రాచుర్యం పొందేందుకు రాబర్ట్ వాద్రా అనూహ్యస్థాయి సంపాదననే ఎంచుకున్నారు.



మమ్మల్ని మేం పరిపాలించుకోలేము, మారాజు తింటే తిన్నాడు మాకు కూడా కొంత విదులుస్తున్నాడు అని సంతృప్తిపడుతూ గెలిపిస్తుంటే, అలాంటి మారాజుల పిల్లలే వచ్చి మమ్నల్ని ఏలాలి అని ప్రజలే ఓట్లు గుద్దుతుంటే, రాబర్ట్ వాద్రా ఒక్కడే దేశద్రోహి అన్నట్టు కేజ్రీవాల్ అతని మీద తన శక్తియుక్తులన్నిటినీ కేంద్రీకరించినట్టు పోరాడటం కొంత ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి కుమారుడు, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి భారీ దోపిడీకి పాల్పడ్డాడని ప్రాథమిక సాక్ష్యాలు స్పష్టంగా రుజువు చేస్తున్నా ప్రజలు ఆయన పార్టీకే ఓట్లు వేశారు. ఇతరత్రా కొన్నిఅంశాలున్నా దివంగత నేత, ప్రియతమ నాయకుడి కుమారుడు కాబట్టే జగన్ బాబుకి ఆ గౌరవం దక్కింది. అలాగే మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న ఎన్.చంద్రబాబు నాయుడు గతంలో తనకమామగారు ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అల్లుడి హోదాలో లంచాలు గుంజారని ప్రాథమిక సాక్ష్యాలతో ఆరోపణలు వచ్చినా, ఆ హోదాతోనే ఆయన ముఖ్యమంత్రి పీఠాన్ని బలవంతంగా చేజిక్కించుకున్నా, ఆ తర్వాత ఎన్నికలలో అదే చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవటానికి ప్రజలేమీ సంకోచించలేదు. ఇలా వీఐపీ వారసత్వాలకు జననీరాజనాలకు దేశవ్యాప్తంగా అనేక ఉదాహరణలున్నాయి. మరి అరవింద్ లాంటి అనుభవం, ఉద్యమ నేపథ్యం, చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి రాబర్ట్ వాద్రా అంశాన్నే ఎందుకు ఎంచుకున్నట్టు? భారత రాజకీయాలలో మార్పు తీసుకురావటం కోసమే తాను ఒక ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్టు ప్రకటించిన వ్యక్తి, ఆయన బృందం ఈ మార్గంలో తన లక్ష్యాన్ని ఏమేరకు చేరుకోగలుగుతుంది? గత మూడు దశబ్దాలుగా ప్రభుత్వాలు, రాజకీయపార్టీలు తాము ప్రజల పట్ల చేయాల్సిన చట్టబద్ధపాలన, శాంతిభద్రతల పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, విద్యుత్, న్యాయం అందించటం, మౌలికవసతుల కల్పన వంటి తొలి బాధ్యతల్ని విస్మరించి, అన్ని అవకాశాల్నీ అందించినా ఇంకా దుర్భర పరిస్థితులలో ఉన్నవారి కోసం

చిట్టచివరిగా అమలు చేయవలసిన పథకాలనే రాజకీయంగా మార్చేశాయి. చీప్ పబ్లిసిటీ, తాత్కాలిక పథకాలే రాజకీయంగా తయారైంది. దానివల్లే ఈవేళ మనం అనుభవిస్తున్న దుర్భరజీవితం, అన్ని వనరులూ, శక్తిసామర్థాలూ ఉన్నా అవకాశాలు దక్కని దైన్యం. ఈ రాజకీయాన్ని మార్చటం కోసం వచ్చామని చెబుతున్న అరవింద్ బృందం కూడా ప్రజలలో ప్రాచుర్యం పొంది రాజకీయ పునాది ఏర్పాటు చేసుకోవటం కోసం చీప్ పబ్లిసిటీనే మార్గంగా ఎంచుకున్నారు.

రాబర్ట్ వాద్రాపై అరవింద్ బృందం బైటపెట్టిన విషయాలేవీ కొత్తవి కావు. ఏడాదిన్నర క్రితమే అవి బైటపడ్డాయి. అటు ప్రతిపక్షాలు, ఇటు ప్రజలు కూడా పెద్దగా వాటిని పట్టించుకోలేదు. ఇప్పుడు అవే ఆరోపణల్ని కొన్ని పత్రాలతో అరవింద్ బృందం మీడియాలో సంచలనాలుగా మార్చింది. ఏ టైంలో, ఏ రీతిలో ఈవెంట్ చేస్తే మీడియా బాగా కవర్ చేస్తుందో ఆ రీతిలో చక్కగా ప్రణాళిక వేసుకుని పత్రాలను విడుదల చేసింది. ఒకరకంగా ఇప్పుడిప్పుడే పరిణతి దిశగా వెళ్తున్న భారతీయ మీడియా బలహీనతల్ని అరవింద్ బృందం చక్కగా వినియోగించుకుంది. కొన్ని వాస్తవాలు, కొన్ని ఊహాగానాలు, కొంత బురద జల్లుడు వెరసి ఒక మసాలా వినోద కార్యక్రమంలా ఉండటంతో ప్రజలలో కూడా ఈ ఆరోపణల కార్యక్రమం కొంత ప్రాచుర్యాన్ని పొందింది. డీఎల్ఎఫ్ అనే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ద్వారా వడ్డీలేకుండా, సెక్యూరిటీ లేకుండా రాబర్ట్ వాద్రా రూ. 65 కోట్లు డబ్బు తీసుకున్నారని, మార్కెట్ రేటు కంటే తక్కువ రేటుకి స్థిరాస్థి కొనుగోలు చేశారని అరవింద్ బృందం ఆరోపణలు. వీటి మీద విచారణ చేయటానికి, చర్యలు తీసుకోవటానికి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఆదాయపన్ను శాఖ, స్వతంత్ర డైరెక్టర్లకు పూర్తి అధికారాలున్నాయి. క్విడ్ ప్రో కో వగైరా ఆరోపణలకు సాక్ష్యాధారాలైతే ఇప్పటిదాకా లేవు కాబట్టి వాటి కోసం ఎదురుచూస్తూ సమయం వృధా చేయకుండా వారు తమ పరిధిలో చర్యలు ప్రారంభించవచ్చు. కానీ వాటిని వదిలేసి రాజకీయాస్త్రాలకే పరిమితం కావటం, ప్రజలు దాన్ని వినోదంగా భావించటం అంత వాంఛనీయం కాదు. చాలా పెద్ద వ్యవస్థీకృత మార్పులు తేవాలనుకున్నవారు ఇలాంటి అంశాల చుట్టూ వివాదాస్పద ప్రచారాన్నే అవినీతిపై పోరాటంగా ప్రొజెక్ట్ చేయాలనుకోవటం సరికాదు. అవినీతిని అంతం చేసే దిశగా బలమైన వ్యవస్థల్ని నిర్మించాలనుకునేవారు వ్యక్తులను టార్గెట్ చేయటం వల్ల తమ ఉద్యమానికి, అంతిమంగా ప్రజల ఆశలకు నష్టం చేసినవారవుతారు. ఢిల్లీ కేంద్రంగా సంచలనాలు వెలువరిస్తుంటే మీడియా ద్వారా ఎక్కువ ప్రచారం రావచ్చు. కానీ మీడియా ప్రచారప్రభావం ఎల్లకాలం ఉండదు. లోక్‌పాల్ తాను కోరుకున్నరీతిలో ఇప్పటికిప్పుడే తేవాలని ఢిల్లీ కేంద్రంగా అన్నా హజారే చేసిన బెదిరింపు నిరాహార దీక్షకు మీడియా ద్వారా వచ్చిన కనీవినీ ఎరుగని ప్రచారం కొంతమేరైనా ప్రజలలో బలమైన ప్రభావం చూపటానికి అన్నా సుమారు రెండు దశాబ్దాలకుపైగా మహారాష్ట్రలో చేసిన కృషి, ఆ క్రమంలో సంతరించుకున్న, నిలకడగా ప్రదర్శించిన వ్యక్తిత్వం కూడా కారణమని గుర్తించాలి. అలా వ్యక్తిత్వంతోపాటు విజన్ కూడా ఉంటేనే అరవింద్ బృందం ఈ దేశానికి రాజకీయంగా పనికొచ్చే మేలు ఏ మేరకైనా చేయగలుగుతుంది.

అరవింద్ బృందం ఏర్పాటుచేస్తున్న పార్టీ బీజేపీ 'బి' పార్టీ అని కాంగ్రెస్ వారు, కొత్త పార్టీ వల్ల కాంగ్రెస్ వ్యతిరేక ఓటు చీలే అవకాశం ఉందని ఇతర పార్టీల వారు చేస్తున్న వాదనల్ని పెద్దగా పట్టించుకోవాల్సిన పనేదుగానీ, అరవింద్ బృందం ప్రకటించిన రాజకీయ ఎజెండాలో కూడా భారత్ వంటి ఒక విశాలమైన, సంక్లిష్టమైన దేశనిర్మాణానికి కావలసిన విజన్ లేదు. శక్తివంతమైన, అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించగల ప్రపంచస్థాయి భారతదేశ నిర్మాణానికి సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్న లోక్‌సత్తాకు ఆ విజన్‌కు నిర్దిష్ట బాటను పరిచింది. వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేస్తూ ఎంతో నిర్మాణాత్మకంగా, సృజనాత్మకంగా రూపొందించిన ఎజెండా, రాజకీయ సంస్కృతి లోక్‌సత్తాది. ఎటువంటి సైద్ధాంతిక పిడివాదాల అవసరమూ లేకుండా సంపూర్ణ స్వేచ్ఛతో, అదేసమయంలో సామాజిక బాధ్యతతో, నిబద్ధతతో ప్రజలు జీవించగలిగే వ్యవస్థ నిర్మాణానికి కావలసిన సిద్ధాంతాన్ని అందించింది లోక్‌సత్తా. సరైన ప్రత్యామ్నాయం చూపకుండా వ్యవస్థను తిడుతూ, వ్యవస్థను కూలదోసే ప్రయత్నం చేస్తూ కాలం వృధా చేయకుండా, జనం చేతికి అధికారాన్ని తీసుకెళ్లి అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసేరీతిలో ప్రత్యామ్నాయం చూపుతూ ఒక నిర్దిష్టపరిష్కారంలో భాగంగా వచ్చింది లోక్‌సత్తా. గుర్తించగలిగితే, ఏ రంగంలోనివారికైనా, ఏ విశ్వాసానికి చెందినవారికైనా లోక్‌సత్తా ఒక జీవనశైలి. సామర్థ్యం, కష్టపడే తత్వం ఉంటే ఎవరైనా, ఏ పదవికైనా లోక్‌సత్తాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికవ్వచ్చు, ప్రజలకు ప్రత్యక్ష రాజకీయాల ద్వారా తాము ఆశించిన సేవలందించవచ్చు.

**(తరువాయి 15వ పేజీలో...)**

# మేం చరిత్రకు సరైన వైపు ఉన్నాం : జేపీ

మేం చరిత్రకు సరైన వైపు ఉన్నాం అని లోక్‌సత్తా పార్టీ ఆరవ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥జయప్రకాష్ నారాయణ్ ఉద్ఘాటించారు.

పార్టీ ప్రధాన కార్యాలయంలో జేపీ మీడియాతో మాట్లాడుతూ... "మహాత్మాగాంధీ పుట్టినరోజు అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీని ప్రారంభించిన నాటి నుంచి ఈ ఆరేళ్ల ప్రస్థానం ముళ్లబాటగా అనేక సవాళ్లు, ఒడిదుడుకుల మధ్యే సాగినా, ఫలితాలను మాత్రం ఖచ్చితంగా సాధిస్తున్నాం" అన్నారు.

"మేం ఇంకా ఎన్నో మైలురాళ్లను అధిగమించాల్సి ఉంది. మెరుగైన భారతదేశానికి గాంధీ మార్గాన్ని మించిన బాట లేదని స్పష్టమైన అవగాహనతో, దృఢసంకల్పంతోనే ఈ సుదీర్ఘ ప్రయాణంలో ముందుకు సాగుతాం" అని జేపీ స్పష్టంచేశారు.

**లోక్‌సత్తా పార్టీ 6వ వార్షికోత్సవం**

మహాత్మాగాంధీ మౌలికంగా నాలుగు విలువలు, సూత్రాల కోసం నిలబడ్డారని జేపీ పేర్కొన్నారు.

"మొదటిది, గాంధీ నైతిక రాజకీయాల కోసం నిలబడి, ప్రజా జీవితమంటే వ్యక్తిగత జీవితానికి కొనసాగింపేనని చాటిచెప్పారు. చెప్పింది చేసి చూపారు. రెండోది, ఎటువంటి సవాలైనా హింసకు, విద్వేషాలకు దిగజారకుండా సృజనాత్మక ఒత్తిడి (క్రియేటివ్ టెన్షన్)తో వాటిని అధిగమించే పరిపక్వ నాయకత్వ సామర్థ్యాన్ని ఆయన ప్రదర్శించారు. ఆ నైపుణ్యంతోనే గాంధీ రకరకాల నేపథ్యమున్న ప్రజలతో కూడి వున్నప్పటికీ ఈ గడ్డ మీద గొప్ప దేశాన్ని నిర్మించారు. మూడోది, ఎదిగే అవకాశాలు అందరికీ అందాలని, ఏ తల్లి గర్భాన పుట్టినా ఎటువంటి వివక్షా ఉండకూడదని ఆయన నిరంతరం చెప్పేవారు. నాలుగోది, గ్రామస్వరాజ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం గాంధీ నిరంతరం పోరాడారు. అధికారానికి పౌరుడు/పౌరురాలు, అతడు/ఆమె కుటుంబం కేంద్రబిందువుగా ఉండాలని ఆయన నిర్వంద్వంగా చెప్పేవారు. గ్రామం లేదా వార్డు స్థాయిలో పౌరులకు సాధ్యమైనంత చేరువగా అధికారాన్ని వినియోగించే వ్యవస్థ ఉండాలని గాంధీ ఎంతో ఆర్తితో పోరాడారు" అని జేపీ పేర్కొన్నారు.

కాలాలకు అతీతమైన, సార్వజనీనమైన గాంధీజీ విలువలు మనలాంటి విస్తృతమైన, సంక్లిష్టమైన, వైవిధ్యమైన, ప్రాచీనమైన సమాజానికి సరిగ్గా సరిపోతాయని జేపీ అన్నారు. "స్వతంత్ర భారతదేశంలో ఆ విలువల్ని కార్యాచరణగా మలచుకోవటంలో మనం విఫలమవటమే మనల్ని సంక్షోభంలోకి నెట్టింది" అని స్పష్టంచేశారు.

గాంధీజీ బోధించి, పాటించిన నైతిక రాజకీయాలు, సమాజంలో సామరస్యత, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు, జనం చేతికి అధికారం అనే ఆ నాలుగు సూత్రాలనే లోక్‌సత్తా పార్టీ స్వీకరించిందని జేపీ వివరించారు.

గత ఏడాది పార్టీ ప్రస్థానం పట్ల లోక్‌సత్తా ఎంతో సంతృప్తితో ఉందని జేపీ అన్నారు. 2-జీ అక్రమ, అవినీతి కేటాయింపుల్ని రద్దు చేయించటంలో లోక్‌సత్తా కీలకపాత్ర పోషించిందన్నారు. ఓ సంకేతంగా చేపట్టిన రైతు సత్యాగ్రహ యాత్ర ద్వారా రైతులకు తరతరాలుగా జరుగుతున్న ఘోర అన్యాయాన్ని భారతదేశం మొత్తానికీ చాటిచెప్పగలిగామన్నారు. నెమ్మదిగానే అయినా ఒక క్రమమైన, స్థిరమైన రీతిలో రాజకీయాలు రైతులకు అనుకూలంగా మారుతున్నాయన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలలో వెల్లువెత్తిన ఉద్యమం వల్ల లోక్‌పాల్, సిటిజన్స్ చార్టర్ల (పౌరసేవాపత్రాల) వంటి అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటుకు సానుకూల పరిస్థితుల ఏర్పడ్డాయన్నారు. లోక్‌సత్తా కృషి వల్ల విద్య, ఆరోగ్యం కేంద్రబిందువులుగా మారుతూ క్రమంగా రాజకీయ చర్చ స్థాయి మెరుగుపడుతోందని జేపీ అన్నారు.

సరైన సమయంలో సరైన అంశాలను లేవనెత్తుతూ ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తూ రాష్ట్రంలో, దేశంలో లోక్‌సత్తా పార్టీ ఒక ఆశాకిరణంగా కొనసాగుతుందని జేపీ అన్నారు. ఈ ఏడాది పార్టీ ప్రారంభించిన సురాజ్య ఉద్యమం, మెరుగైన భారతదేశానికి పక్కాబాట వేస్తుందని పేర్కొన్నారు. లోక్‌సత్తా పార్టీ అంతర్గత ఎన్నికల్ని రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, సామాన్య ప్రజలే పార్టీని పూర్తిగా సొంతం చేసుకుని, నిధుల్ని సమకూర్చుకుని, నియంత్రించేలా పార్టీ సంస్థాగత నిర్మాణం జరుగుతోందని అన్నారు.

ఆలోచనాపరులు ఒడ్డునకూర్చుని గడ్డలేయకుండా, రాజకీయాల్ని, సమాజాన్ని మార్చటం కోసం ముందుకొచ్చి లోక్‌సత్తా పార్టీ సొంతం చేసుకోవాలని జయప్రకాష్‌నారాయణ్ పిలుపునిచ్చారు.

"అన్నిటికీ మూలాధారమై ప్రతిపనితో ముడిపడిన రాజకీయాల్ని కేవలం రాజకీయ నేతలకే వదిలేయకుండా యువత, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, రైతులు రాజకీయాలలోకి రావాలి" అని జేపీ అన్నారు. ■

# లాలూచీ అవినీతి అరికట్టే చట్టం తేవాలి: జేపీ

కార్పొరేట్ సంస్థలు లాలూచీ పడి అవినీతికి పాల్పడుతున్న కేసులు పెరిగిపోతూ దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో తగిన మార్పులతో అవినీతి నిరోధక చట్టాన్ని బలోపేతం చేయాలని ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్ తాజాగా చేసిన ప్రకటనను లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆహ్వానించారు.

అక్టోబర్ 11న పార్టీ ప్రధాన కార్యాలయంలో జేపీ మీడియాతో మాట్లాడుతూ... గనులు, స్పెక్ట్రం వంటి దేశ సహజ వనరుల్ని కొల్లగొట్టే లాలూచీ అవినీతి (కొల్యూజివ్ కరప్షన్)ని అరికట్టేందుకు పటిష్ట చర్యలు ఈ దశలో చేపట్టటం చాలా అవసరమని రెండో పరిపాలనా సంస్కరణల సంఘం (ఏఆర్‌సీ) సభ్యునిగా తాను 2005లోనే ప్రధానికి సమగ్రంగా వివరించానని, ఏఆర్‌సీ నివేదికలోని నాలుగు కీలక సిఫార్సుల్ని ఇప్పటికైనా అవినీతి నిరోధక చట్టంలో చేర్చాలని డిమాండ్ చేశారు. లాలూచీ పడిన అవినీతి కేసులలో శిక్షను రెట్టింపు చేయాలని, ప్రాథమిక ఆధారాలుంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను ఆయా కంపెనీలు, వ్యక్తుల మీదే ఉండేలా చేయాలని, అవినీతిపరుల ఆస్తుల్ని విధిగా ఆస్తుల్ని జప్తుచేయాలని, ఆపైన అప్పనంగా లాభాలు వస్తే వాటి మీద 'విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్ను' విధించాలని అన్నారు.

లంచం ఇచ్చినవారు, పుచ్చుకున్నవారు ఇద్దరూ నేరస్తులే అన్న ప్రధాని వాదనను జేపీ తోసిపుచ్చారు. ఒక సర్టిఫికెట్ కోసమో, పౌరహక్కుగా అందాల్సిన మరో సేవ కోసమో ఎవరైనా గతిలేక లంచం ఇవ్వటాన్ని, లాలూచీ పడి ప్రజల వనరుల్ని, ప్రభుత్వ ధనాన్ని లూటీ చేయటాన్ని ఒకేలా చూడటం సరికాదన్నారు. రెండో పరిపాలనా సంస్కరణల సంఘం నివేదిక ఇచ్చాకే బ్రిటన్ వంటి దేశాలు అందులోని సిఫార్సులతో చట్టాలు చేశాయని, ప్రధాని తాను ప్రతిపాదిస్తున్న బలమైన అవినీతి నిరోధక చట్టానికి రెండో ఏఆర్‌సీ చేసిన సమగ్ర ప్రతిపాదనల్నే ప్రాతిపదికగా తీసుకోవాలని జేపీ కోరారు.

బాబ్లీ విషయంలో తెలంగాణ రైతుల ప్రయోజనాల్ని, రెండు రాష్ట్రాల మధ్య సామరస్యాన్ని కాపాడేలా ఏర్పాటు ఉండాలి

నిబంధనల్ని, ఆంధ్రప్రదేశ్ హక్కుల్ని ఉల్లంఘించి రిజర్వాయర్‌లో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుకు మన రాష్ట్రం రూ.200కోట్లు ఇవ్వటంలో అర్థం లేదని జేపీ స్పష్టంచేశారు. ఆ ప్రాజెక్టు మీద మహారాష్ట్రకు హక్కు లేకుండా చేసి, మహారాష్ట్రకు మంచినీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆంధ్రప్రదేశ్ ఇచ్చే ఏర్పాటు చేయాలని, దీని పర్యవేక్షణకు కావాలంటే కేంద్ర జల సంఘం తరుపున ఒక బృందాన్ని ఏర్పాటు చేయవచ్చని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా సుప్రీంకోర్టు తీర్పు ఉండాలని, అలాగే సమాఖ్య వ్యవస్థలో వున్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య చిలికిచిలికి గాలివానలా మారకుండా సామరస్య వాతావరణం నెలకొనేలా తగిన ఏర్పాట్లను అత్యున్నత న్యాయస్థానం చేయాలన్నారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య బాగ్లిహార్ ప్రాజెక్టు విషయంలో దాదాపు బాబ్లీ తరహా వివాదమే తలెత్తినప్పుడు రెండు దేశాల మధ్య విద్వేషపూరిత వాతావరణం ఉన్నా అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో శాంతియుతంగా, హుందాగా, పరస్పర లాభదాయకంగా పరిష్కరించుకున్న తీరు మార్గదర్శకం కావాలని జేపీ అన్నారు.

కృష్ణా నదీజలాల పంపకం వాటాల్లో మనరాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, బాబ్లీ వివాదం విషయంలో వినిపించినట్టే కృష్ణా ట్రిబ్యునల్ ముందుకఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రమైన, బలమైన వాదనల్ని వినిపించి రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడాలన్నారు. కృష్ణా ట్రిబ్యునల్ ముందు వినిపించాల్సిన వాదనలపై లోక్‌సత్తా తన సూచనల్ని ఇప్పటికే ప్రభుత్వానికి అందించిందని, వాటిని పరిగణలోకి తీసుకోవాలని జేపీ కోరారు. ■

# కొత్త లోకాయుక్త నియామకం ఒక దుస్సంప్రదాయం

కొత్త లోకాయుక్త నియామకంలో గవర్నర్ ఒక దుస్సంప్రదాయానికి ఆమోదం తెలిపారు

రాష్ట్ర లోకాయుక్తగా జస్టిస్ సుభాషణ్ రెడ్డిని నియమించటం ద్వారా గవర్నర్ ఒక దుస్సంప్రదాయానికి ఆమోదం తెలిపారని జేపీ సగౌరవంగా తప్పుపట్టారు. ఎంతో అనుభవం ఉన్న జస్టిస్ సుభాషణ్ రెడ్డిని తాము వ్యక్తిగతంగా ఈ వివాదంలోకి లాగటం లేదని, అయితే ఒకసారి మానవ హక్కుల సంఘంలో సభ్యునిగా లేక ఛైర్మన్‌గా పనిచేసిన వారు మళ్లీ మరొక ప్రభుత్వ పదవిలో పనిచేయకూడదని పార్లమెంటు చేసిన చట్టంలో (హెచ్ఆర్‌సీ చట్టం 24 (3))ఉందని, సర్వోన్నత సభ చేసిన చట్టాన్ని, రాజ్యాంగాన్ని రాష్ట్రప్రభుత్వమే ఉల్లంఘించటం కంచే చేను మేసిన తీరుగా ఉందని అన్నారు. గవర్నర్ ఆ ఫైల్‌ను రెండోసారి కూడా వెనక్కి తిప్పిపంపాల్సిందని, రాష్ట్రప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే అటార్నీ జనరల్ అభిప్రాయానికి పంపివుండవచ్చుని అన్నారు. ఇలాంటి నియామకం చేయవచ్చని కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చిందని తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయటాన్ని కూడా జేపీ తీవ్రంగా ఆక్షేపించారు. కేరళ హైకోర్టు తీర్పు ఆ రాష్ట్రంలోని కోర్టులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు. చట్టం పట్ల లోతైన అవగాహన కలిగిన జస్టిస్ సుభాషణ్ రెడ్డి సముచిత నిర్ణయం తీసుకోగలరని ఆశిస్తున్నామని తెలిపారు.

### స.హ కమీషనర్లు ఎంపికపై సుప్రీంకోర్టు రూలింగ్ అసంబద్ధం

న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడే జాతీయ జ్యుడీషియల్ కమిషన్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నామని జేపీ అన్నారు.

న్యాయవ్యవస్థల స్వతంత్ర ప్రతిపత్తి కోసం నిరంతరం పోరాడే పార్టీ లోక్‌సత్తా అని, అయితే తమకు స్వతంత్ర ప్రతిపత్తి రాజ్యాంగ పరిరక్షణ కోసమే తప్ప తమ సంస్థలలోని సిబ్బంది హక్కుల పరిరక్షణకు కాదని న్యాయస్థానాలు ఇటీవల విస్మరిస్తుండటం ఆందోళనకరమని జేపీ అన్నారు. క్వాజీ జ్యుడీషియల్ హోదాలో పనిచేసే పాలనా సమాచార చట్టం సభ్యులలో మాజీ న్యాయమూర్తులు ఉండాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరికాదని ఆ చట్టంలో ప్రతి పదాన్నీ రాసిన వ్యక్తిగా తాను సాధికారికంగా చెప్పగలనన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి స్టేషన్ హౌస్‌మేనేజర్ వరకూ అనేకమంది అధికారులు క్వాజీ జ్యుడీషియల్ బాధ్యతలు నిర్వరిస్తుంటారని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమైతే ఆయా పదవులన్నిటిలో న్యాయమూర్తులే ఉండాల్సుంటుందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రతిష్ఠ మసకబారితే కేవలం ఆయా సంస్థలకు మాత్రమే నష్టంకాదని, అది యావత్ దేశానికే నష్టమని అన్నారు. న్యాయమూర్తుల నియామకాలు న్యాయమూర్తుల చేతిలోనే ఉండాలన్న అసంబద్ధ వాదనల్ని కూడా చేస్తున్నారని, అలాంటి పద్ధతి ప్రపంచంలో ఎక్కడా లేదని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో కీలకమైన న్యాయవ్యవస్థను పటిష్టంగా, ప్రజలలో విశ్వసనీయతను పెంపొందించేలా తయారుచేసేందుకే నిజాయతీకి, నిర్భీతికి, స్వతంత్ర ప్రతిపత్తికి మారుపేరైన జస్టిస్ వి.ఆర్ కృష్ణయ్యర్, జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వెంకటాచలయ్యల ద్వారా 'జాతీయ జ్యుడీషియల్ కమిషన్' ఏర్పాటుకు బిల్లును రూపొందించామన్నారు. ఆ బిల్లు ప్రస్తుతం కేంద్రంలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల పరిశీలనలో ఉందని, త్వరలో సాకారమవుతుందని ఆశిస్తున్నామన్నారు.

### ప్రతిపక్షాలను విమర్శించేందుకు ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమాన్ని ఉపయోగించుకోవటమా?

ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ఇటీవల ఒక అధికారిక కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీ గురించి రాజకీయ విమర్శలు చేయటం పట్ల జేపీ అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమంలో ప్రభుత్వ విధివిధానాలను ప్రజలకు వివరించటం, వాటికి సంబంధించి విమర్శలకు సమాధానం చెప్పటం చేయవచ్చని, అంతేతప్ప రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు చేయటం ఎంతమాత్రం తగదని అన్నారు. ముఖ్యమంత్రి అంటే ఒక పార్టీకి సీఎం కాదని, రాష్ట్రప్రజలందరికీ సీఎం అని, అధికార కార్యక్రమాన్ని పార్టీ వేదికగా మారిస్తే ఖచ్చితంగా వారించాలన్నారు. తప్పు, ఒప్పుల మధ్య గీత ఇటీవల చెరిగిపోతోందని, ఈ ధోరణిని చూసీచూడనట్టు వదిలేస్తే వ్యవస్థలో మరో దుస్సంస్కృతి వేళ్లూనుకుంటుందన్నారు.

### పాదయాత్రలు ఎవరి కోసం...?

తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, వైకాపా నేత షర్మిలల పాదయాత్రపై ప్రశ్నించగా, పాదయాత్రలు మన కోసం చేస్తున్నామా, ప్రజల కోసం చేస్తున్నామా అనేది వారు ప్రశ్నించుకోవాలన్నారు. ధాన్యం అమ్మకాలపై ఉన్న అన్యాయపు ఆంక్షలకి వ్యతిరేకంగా రైతు సత్యాగ్రహ యాత్ర పేరుతో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి కర్ణాటక రాష్ట్రంలోని దిల్కాసుగూర్ వరకూ 36 కి.మీ. లోక్‌సత్తా చేసిన పాదయాత్ర వల్ల రైతులకు సుమారు రూ.3,000కోట్ల లాభం చేకూరిందని, అంటే కిలోమీటరుకి సుమారు రూ.100కోట్ల మేర ప్రజలకు లాభం వచ్చిందని అన్నారు. అలాగే గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు దళితవాడలోని లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని, మద్య నియంత్రణ అమలుచేయాలని ఆ జిల్లాలో 2007లో 63 కిలోమీటర్ల పాదయాత్ర వల్ల బెల్టుషాపులకు అడ్డుకట్ట వేసే దిశగా మంచి ఫలితాన్ని సాధించామన్నారు. అలా నిర్దిష్ట ప్రజాప్రయోజనకర ఫలితాలు సాధించేలా కొన్ని ప్రమాణాలతో లోక్‌సత్తా పాదయాత్రలు చేపడుతుందన్నారు.

### చట్టం అమలులో వీఐపీ సంస్కృతి పోవాలి

రాబర్ట్ వాద్రాపై అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలపై తొలిగా స్పందించింది లోక్‌సత్తా పార్టీయేనని, రూ.65కోట్ల మేర వడ్డీలేని, ఎటువంటి సెక్యూరిటీలేని రుణం, మార్కెట్ ధరకంటే తక్కువకు అమ్మకాలు జరిగితే డీఎల్ఎఫ్ అనే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో స్వతంత్ర డైరెక్టర్లు, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఏం చేస్తున్నారు అని జేపీ ప్రశ్నించారు. క్విడ్ ప్రోకో లాంటి అంశాల కోసం ఆధారాల దాకా కూడా వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఆయా ప్రభుత్వ సంస్థలు ఆ ఆరోపణల మీద చర్యలు తీసుకోవచ్చన్నారు. చట్టం అమలులో ఈ వీఐపీ సంస్కృతి పోవాలని, డబ్బున్నవారికి ఒకలా, పేదలకు ఒకలా చట్టం అమలు చేసే స్థానంలో చట్టబద్ధపాలన రావాలని ఇందుకోసమే లోక్‌సత్తా న్యాయసంస్కరణలకు కృషి చేస్తోందని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ■

# అరవింద్ కేజ్రీవాల్ బృందం బైటపడుతుందా?

**(11వ పేజీ తరువాయి)**

అందుకే, ఎవరెన్ని చెప్పినా, ఎంత ఆలస్యమైనా మనదేశంలో మార్పు తేవటానికి లోక్‌సత్తా ఎజెండా తప్ప మార్గం లేదు. అరవింద్ బృందం తమ పంథాను, విజన్‌ను కొంత సమీక్ష చేసుకుని వ్యవస్థీకృత మార్పుల కోసం లోక్‌సత్తాలాంటి శక్తులతో కలిసి పనిచేసేందుకు ప్రాధాన్యమివ్వాలి. అసహనంతో తలెత్తిన చీప్ పబ్లిసిటీ మేనియా నుంచి బైటపడి ఒక సమగ్రమైన, దీర్ఘకాల పోరాటానికి క్రమపద్ధతిలో సిద్ధమవ్వాలి. రాబర్ట్ వాద్రాపై వచ్చిన ఆరోపణల మీద చర్చ ప్రజలలో ఎంత ఉత్సుకతతో కూడిన వినోదభావనను రేకెత్తించినా, తాము ఆరాధించి నెత్తినపెట్టుకున్న కుటుంబాలలోనివారు ఇలా వ్యవహరించటం జనం మనసుల్ని ఎంతో గాయపరుస్తోందన్నది వాస్తవం. ఏం చేయాలి అని ప్రజలలో ఆక్రోశం, మథనం రగులుతున్నాయి. ఏదోక సమయంలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఆ అంతర్మథనం నుంచి ఇప్పుడు హాలాహలమే రావచ్చు, కానీ అంతిమంగా అమృతం వస్తుంది. చైతన్యవంతులైన ప్రజలు నిరంతర జాగురూకతతో వ్యవహరించటం మినహా ఒక దేశ సాధికారతకు, అభివృద్ధికి, ప్రజాస్వామ్య వికాసానికి గ్యారంటీ మరోటి లేదు. కాబట్టి ప్రజల్ని తక్షణం ఆకట్టుకునేందుకే కాకుండా, ప్రజల భావాలను మలుస్తూ, వారిని సమీకరిస్తూ, ఎక్కడికక్కడ రాజకీయాలలో క్రియాశీలక భాగస్వాముల్ని చేస్తూ దీర్ఘకాల లక్ష్యసాధన దిశగా ఓపిగ్గా తీసువెళ్లటం ఇప్పుడవసరం.

బహుశా చరిత్రలో ఎన్నడూ లేనంత చారిత్రక సంధి దశలో ఈవేళ భారతదేశం ఉంది. ఈ పరిస్థితిని అధిగమించి మనదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపాలంటే, గత 2,500 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ చూడనంత గొప్ప నిర్మాణాత్మక, సృజనాత్మక, సమర్థ ఎజెండా, నాయకత్వం ఇప్పుడు మనకి కావాలి. అందుకే ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ పునాదిగా వస్తున్న కొత్త పార్టీ లోక్‌సత్తాతో కలిసికట్టుగా మెరుగైన భారతదేశ నిర్మాణం కోసం పనిచేయాలి. మునుపెన్నడూ లేనిరీతిలో దేశజనాభాలో 70శాతానికిపైగా, ప్రస్తుతం ఓటువేసే వారిలో 50శాతం మేర ఉన్న యువత, విస్తృతస్థాయిలో అందుబాటులోవున్న సాంకేతికపరిజ్ఞానం ఆ లక్ష్యసాధనకు బలమైన చోదకశక్తులుగా ఉపయోగపడతాయి.

**– 21వ శతాబ్దపు భారతీయుడు**

# సమాచార హక్కు చట్టం అమలు పై లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సర్వే

**సమాచార హక్కు చట్టం అమలు తీరుపై రాష్ట్ర వ్యాప్త సర్వే వివరాలు :**

భారత దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేసిన చట్టాల్లో కెల్లా ఉత్తమమైన చట్టంగా పేర్కొంటున్న సమాచార హక్కు చట్టం 7 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ చట్టం అమలు తీరుపై 12 జిల్లాల్లో ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 6 ప్రశ్నలతో కూడిన సర్వే చేశారు. మహబూబ్‌నగర్, తూర్పుగోదావరి, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, మెదక్, విశాఖపట్నం, గుంటూరు, కడప, చిత్తూర్, ప్రకాశం, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాలలో సర్వే నిర్వహించనైనది. సర్వేలో వెల్లడైన వాస్తవాలను ఈ రోజు సమాచారహక్కు చట్టం దినోత్సవం సందర్భంగా విడుదల చేస్తున్నాం.

ఈ సంవత్సరం ఇప్పటి వరకూ అందిన దరఖాస్తుల సంఖ్య సర్వే నిర్వహించిన జిల్లాలో 9,210 కాగా, వాటిల్లో 7,435 దరఖాస్తులకు సమాచారాన్ని అందించారు. అంటే 80.73 శాతం దరఖాస్తులకు సమాచారం అందినట్లుయింది. కేవలం 1775 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. అంటే అవి 19.27 శాతం అన్న మాట.

పంచాయితీ రాజ్, విద్యాశాఖ, పోలీస్, వ్యవసాయం, మున్సిపాలిటీ, ఆరోగ్యం, రిజిస్ట్రేషన్, విద్యుశ్చక్తి, ట్రెజరీ, రెవిన్యూ, సాంఘీక సంక్షేమం, ఫారెస్ట్, హౌసింగ్, ఆబ్కారి, డిఫెన్స్, మొదలగు శాఖల్లో సర్వేనిర్వహించనైనది.

సర్వే నిర్వహించిన జిల్లాల్లో అత్యధికంగా సర్వే చేసిన కార్యాలయాల్లో చట్టం అమలు తీరు తెన్నులు?

ప్రజలకు నిత్యం అవసరపడే 6 ప్రభుత్వ శాఖల గురించిన వివరాలు మాత్రం పొందుపరచడం జరిగింది. సర్వే నిర్వహించిన జిల్లాల్లో పైనుదహరించిన శాఖల్లో అందిన దరఖాస్తులు, వాటికి అందిన సమాచార వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. వివరాల శాతం ఈ విధంగా ఉంది.

**- మున్సిపాలిటీలో 70 శాతం దరఖాస్తులకు సమాచారం అందించగా, 30 శాతం సమాచారం అందించలేదు.**

**- పోలీసులో 41 శాతం సమాచారం అందించగా, 59 శాతం అందించలేదు.**

**- విద్యాశాఖలో 79 శాతం సమాచారం అందించగా, 21 శాతం అందించలేదు.**

**- పంచాయితీరాజ్ శాఖలో 97 శాతం సమాచారం అందించగా 3 శాతం అందించలేదు.**

**- రెవిన్యూ శాఖలో 88 శాతం అందించగా 12 శాతం అందించలేదు.**

**- ఆరోగ్య శాఖలో 84 శాతం అందించగా, 16 శాతం అందించలేదు.**

పైనుదహరించిన సర్వే వివరాలు పరిశీలించినచో సమాచార హక్కు చట్టం అమలుకు రాష్ట్రంలో ఇంకా కృషి జరగాల్సిన అవసరం ఉందని తెలుస్తుంది.

| క్ర.సం | అంశాలు | అవును శాతం | కాదు శాతం |
|---|---|---|---|
| 1. | కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అందుబాటులో వుంది | 94.1 | 5.9 |
| 2. | ప్రజా సమాచార అధికార (పి.ఐ.ఓ) పేరును అందరికీ కనపడే విధంగా ప్రదర్శించారు. | 94.5 | 5.5 |
| 3. | సెక్షన్ 4(1) బి ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన 17 అంశాలను ప్రకటించారు. | 75.1 | 24.9 |
| 4. | ఒకవేళ ప్రకటించి వుంటే దానిని సమయానుకూలంగా మార్పులు చేస్తున్నారు | 63.42 | 36.58 |
| 5. | ఈ సర్వే సంవత్సరంలో ఇప్పటి వరకూ అందిన దరఖాస్తుల సంఖ్య | 9210 | - |
| 6. | 30 రోజులలో సమాచారం అందించిన దరఖాస్తుల సంఖ్య | 7435 | - |

| | మున్సిపాలిటీ | | పోలీసు | | విద్య | | పంచాయితీరాజ్ | | రెవిన్యూ | | ఆరోగ్యం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | అవును % | కాదు % | అవును % | కాదు % | అవును % | కాదు % | అవును % | కాదు % | అవును % | కాదు % | అవును % | కాదు % |
| 1. కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అందుబాటులో వుంది. | 92.8 | 7.14 | 91.2 | 8.8 | 96.1 | 3.81 | 92.8 | 7.2 | 94.3 | 5.7 | 91.3 | 8.7 |
| 2. ప్రజా సమాచార (పి.ఐ.ఓ) పేరును అందరికీ కనపడే విధంగాప్రదర్శించారు. | 80.0 | 20.0 | 88 | 12 | 92.3 | 7.6 | 91.2 | 8.8 | 92.4 | 7.6 | 95.2 | 4.76 |
| 3. సెక్షన్ 3 (1) బి ప్రకారం,స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన 17 అంశాలను ప్రకటించారు. | 53.8 | 46.2 | 91.0 | 9.0 | 73.0 | 27.0 | 72.7 | 27.3 | 73.5 | 26.5 | 54.5 | 45.5 |
| 4. ఒకవేళ ప్రకటించి వుంటే దానిని సమయానుకూలంగా మార్పులు చేస్తున్నారు. | 50.0 | 50.0 | 46.4 | 53.6 | 76.4 | 23.6 | 65.6 | 34.4 | 60.6 | 39.4 | 45.4 | 54.6 |

# సహ కార్యకర్తలకు సంపూర్ణ రక్షణ




**హైదరాబాద్ :** సమాచార హక్కు (సహ) ఉద్యమ కార్యకర్తలకు పూర్తి రక్షణ కల్పిస్తామని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) జన్నత్ హుస్సేన్ తెలిపారు. వారిపై వేధింపులకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు. సహ చట్టం అమలులోకి వచ్చి ఏడేళ్లు పూర్తి అయిన సందర్భంగా యునైటేడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయినింగ్ (యుఎఫ్ – ఆర్టీఐ) స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమం లో జన్నత్ హుస్సేన్ పాల్గొన్నారు. సహ చట్టంలోని 4(1)(ఎ) రికార్డుల నిర్వహణ, 4(1)(బి) కార్యాలయ పూర్తి సమాచారం, 4(1)(సీ) విధివిధానాల రూపకల్పనలో ప్రజలతో సమావేశాల నిర్వహణ విషయాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి తమ సంస్థ సహచట్టంపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోందని అపార్ట్ కమిషనర్ చంద్రమౌళి చెప్పారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వారికి చట్టాలపై గౌరవం లేకుండా పోతోందని హెచ్ఎంటీవీ సీఈవో రామచంద్రమూర్తి అన్నారు. సహచట్టం అమలు కోసం ఈనాడు–ఈటీవీ విశేషంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా ఉద్యమ సమన్వయకర్త టి.ఎల్. నరసింహారావు, బి. రామకృష్ణంరాజు, (యుఎఫ్ – ఆర్టీఐ)లు మాట్లాడారు.

**సూచన:** మీరు, మీ స్నేహితులు ఎవరైనా లోక్‌సత్తా పార్టీలో చేరదలచుకుంటే ఇక్కడ పొందుపరచిన సభ్యత్వ ఫారాన్ని ఉపయోగించుకోవచ్చును. పూరించిన దరఖాస్తును ఇం.నం. 8-2-674బి/2/9, ప్లాట్ నం. 93హ్యాపీవ్యాలీ, రోడ్‌నం.13ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034 రాష్ట్ర కార్యాలయానికి పంపించండి.

**APPLICATION NO.:**
LSP/PRI/

**Rs. 100/-for 3 Years.**
**(Rupees one hundred only, for three years)**

# LOK SATTA PARTY
**New Politics for a New Generation**

## ACTIVE MEMBERSHIP
**Application Form**

PHOTO

**FULL NAME**
............................................................
FAMILY NAME NAME

## PERSONAL DETAILS

DATE OF BIRTH : ____/____/______ (dd / mm / yyyy)

GENDER: M ☐ F ☐

MARITAL STATUS:
☐ Single ☐ Married

SOCIAL CATEGORY (for statistic purpose only)
☐ O.C ☐ S.C ☐ S.T
☐ B.C ☐

EDUCATIONAL QUALIFICATION : __________

PROFESSION: __________

GROSS ANNUAL INCOME:
__________

## CONTACT DETAILS

H.NO: __________ STREET NAME: __________

AREA: __________ PIN: __________

MANDAL/DIVISION: __________ DISTRICT : __________

ASSEMBLY CONSTITUENCY: __________

POLING STATION NAME / No. : __________ STATE: __________

TEL: __________ MOBILE: __________

EMAIL: __________

Referred by: __________

His/Her ID No.: __________

**Volunteer Name :** __________

Ph. No. : __________ Signature: __________

**UNDERTAKING**

I confirm that the information furnished above is true to the best of my knowledge and that I read the terms & conditions set forth in the membership document and I shall abide by the same and shall be subject to the disciplinary code of the party. I affirm that I do not have any criminal record on me. I have paid the prescribed membership fee.

DATE: __________ SIGNATURE: __________

# పేరు స్వతంత్రం...పెద్ద కుతంత్రం

ఉత్సవ విగ్రహ ఊరేగింపుగ
స్థానిక పాలక వర్గాలు
శాసనసభ్యుల జమీలుగా
మారిన అసెంబ్లీ సెగ్మెంట్లు
ఓటునోటు అపవిత్ర బంధమై
చేటు నాయకుల పాలనలో
గాలి,నీరు,నేల,అడవి
అన్నీ అంగడి బొమ్మలే
ప్రజల కోర్కెలకు ప్రజల సొమ్ములే
ఉచిత వరాలు,మహిత సేవలు
మోసం,ద్రోహం,దగా,కుట్రల
అర్ధరహిత ప్రజాస్వామ్యమిది
ధనస్వామ్యమిది, కులస్వామ్యమిది
మతస్వామ్యమిది, మత్తుస్వామ్యమిది
ప్రాంత స్వామ్యమిది విభ్రాంతస్వామ్యమిది
అంధస్వామ్యమిది, అజ్ఞానస్వామ్యమిది
దురాశపరుల ఉన్మత్తపెత్తనం
ఉపేక్షించి విడ్డూరం చూస్తే
కుప్పకూలు ఆకాశ హర్మ్యమిది
పేరుస్వతంత్రం... పెద్ద కుతంత్రం
విలువల పాతర విధాన సౌధం
దోపిడి రాజ్యం దొంగల భోజ్యం
కట్టు కథల కనికట్టు మాటలతో
నేతల చేతలే చెద పుట్టలు ఐతే
నీతి బాహ్యమై అవినీతి రాజ్యమై
నిర్లిప్తతతో, నిస్తేజంగా, నిర్లక్ష్యంగా
నిజ ప్రభువులు నిస్సహాయులయితే
పతనం దిశగా పరుగులు తీస్తే
నిలువరించు వారెవ్వరు
నీవు గాక ఇంకెవ్వరు
నేనుగాక మరివెవ్వరు
మనం గాక వేరెవ్వరు
సురాజ్యభేరి ... వినూత్నశ్రుతి

**-ఉప్పలపాటి మాచిరాజు,** రామచంద్రపురం

# సురాజ్య ఉద్యమ పాట

పల్లవి : చూస్తు ఉందామా చూస్తూనే ఉందామా
భరతమాత భవితకు పునాదులు వేద్దామా
ఎందరో మహనీయుల త్యాగఫలాలు
కొందరి అవినీతిపరుల పాలవుతుంటే !!చూస్తు!!

**చరణం 1 :**

కులమతాల వివక్షతలు ప్రాంతీయ పగలను పెంచి
విభజించి పాలించే విషపూరిత నాయకులు
మనిషి మనిషి మధ్యలోన అగ్గిని రాజేస్తుంటే
అంబేద్కరు బాపూజీ కలలు కల్లలవుతుంటే
నారాయణ గురు చెప్పిన నినాదంబు మారుతుంటే !!చూస్తు!!

**చరణం 2 :**

మన ఘనులు, మన భూములు మన పన్నుల డబ్బులను
రాజకీయ ముసుగుల్లో రాక్షసుల్లై దోస్తుంటే
అడుగడున అవినీతి హద్దులు దాటేస్తుంటే
అడిగివాడు ఎవడు లేక అరాచకం చేస్తుంటే
అన్ని తెలిసి అడగలేని అసమర్థపు మనుషులను !!చూస్తు!!

**చరణం 3 :**

తెల్ల దొరలనెదిరించి సాధించిన స్వరాజ్యంబు
నల్ల దొరలనెదిరించక స్వాహా రాజ్యంబాయే
తరతరాలు గడుస్తున్న తల ఎత్తుకు బతకలేక
ఉద్యమాలు చేసి యువత ఉద్యోగం లేదంటూ
ఉడుకు రక్తమును చల్లి ఉరికొయ్యలు ఎక్కుతుంట !!చూస్తు!!

**చరణం 4 :**

ప్రభుత్వాన్ని పన్నులిచ్చి పోషించి ప్రజలంతా
ప్రభువులుగా మన సేవలు హక్కుగ పొందుట కొరకై
ఇంటిముందు ప్రభుత్వంబు కంటిముందు పాలనకై
కదలి రండి సురాజ్యఉద్యమము లోనికి
స్వార్థ నాయకులు యేలే స్వాహా రాజ్యంబు కూల్చగ !!చూస్తు!!

**- పగడాల వెంకటేశ్వరరావు,** హైదరాబాద్

# 'కార్మిక గీతం' గురించి...

- ఆర్.సుధాభాస్కర్

నేను కవిని కాను. కథకుణ్ణి అంతకంటే కాను, రచయితతో ముఖ పరిచయం కూడా లేదు. కాని అక్కినేని కుటుంబరావుగారి లాంటి చెయ్యి తిరిగిన రచయిత తన నవల ముద్రణ సందర్భంగా నాలాంటి ట్రేడ్ యూనియన్ కార్యకర్తను ''ముందుమాట'' రాయాలని అడగడం మిగతా వారికి ఆశ్చర్యంగా వున్నా నాకు (లోలోపల భయం వున్నా) ఒకింత గర్వంగా కూడా ఉంది. ఈ పుస్తకం నా ఫీల్డేనన్న ధైర్యంతో ఒప్పుకున్నా. పైగా నేను ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఓనమాలు దిద్దుకున్న పటాన్‌చెరు "కాన్వస్" కూడా నన్ను ఒప్పుకోమని వత్తిడి చేసింది.

కుటుంబరావు గారు నాకిచ్చిన కాలపరిమితి ఎప్పుడోదాటి పోయింది. ట్రేడ్‌యూనియన్ రంగంలో నా బాధ్యతలు ఈ "ముందు మాట"కు అడ్డంపడ్తూనే వున్నాయి. చివరికి సిఐటియు జనరల్ కౌన్సిల్ నా పరువు నిలిపింది. కోయంబత్తూర్‌లో ఈ ముందుమాట పురుడుపోసుకుంది. ఇక్కడి వరకు నా గోల! ఇహ పుస్తకం గురించి....

ఒక ఆలోచన రాగానే కాగితాలు ఖరాబు చేసి పారేయగల సమర్ధులు నేటి సమాజంలో చాలా మందే వున్నారు. "తులసి దళా"ల్ని విరబూయించగలవారు, 'కాష్మోరా'ల్ని సృష్టించగల వారికి కూడా కొదవలేదు. వ్యక్తివాదాన్ని, కెరీరిజాన్ని ప్రోత్సహించే రచనలు ''విజయానికి వందమెట్లు'', "వ్యక్తివికాసం", వెల్లువెత్తుతున్నాయి. సరుకులు కొనుక్కోవడం, అనుభవించడమే జీవిత పరమార్ధం అన్నట్లు రచనలు సాగుతున్నాయి. మానవుడు సంఘజీవనే విషయం మరుగున పడిపోతున్నది. కాని "ఎవరికీ పట్టని కార్మికుల జీవితాలు" అధ్యయనం చేయడమే గాక, దాన్ని కథా వస్తువుగా ఎంచుకుని నవలగా మలచడానికి ధైర్యం చేసిన కుటుంబరావుగారు ధన్యులు. "పుస్తకం హస్త భూషణం"గా మిగల్రాదని, అదోచైతన్యదీపిగా ఉండాలన్న విషయం సామాజిక స్పృహ వున్న వారంతా అంగీకరించే సత్యం. అదే కుటుంబరావుగారూ చేశారు. చెలం అన్నట్లు "కాలికింద పడి నలిగిన గడ్డిపూవు ఆర్తనాదం, విరిగిన చీమకాళ్ళ చప్పుడు'' వినే ప్రయత్నం చేసి కుటుంబరావుగారికి కార్మికలోకం రుణపడి ఉండాలని నా ఆకాంక్ష.

ముగ్గురు, నల్గురు, హీరోలతో వచ్చే సినిమాలను "మల్టీస్టార్" సినిమాలనో, "స్టార్‌స్టడ్డెడ్" సినిమాలనో అంటాం. అలాంటి నవలల్ని ఏమంటారో నాకు తెలీదుగాని, ఈ నవల్లో ఎందరు హీరోలు?! అబ్దుల్లాతో మొదలై మోహన్‌రావ్‌తో ముగుస్తుందా ఆ లిస్టు? నేను ముగియదంటాను. హెచ్‌ఎస్ఆర్ఎమ్ కార్మికుల్ని పటాన్‌చెరులో అరెస్ట్ చేసిన పోలీసులు జహీరాబాద్ అవతల అడివిలో వదిలేస్తారు ఎక్కడున్నారో తెలియదు! ఎంత దూరం నడవాలో, అసలు ఎటు నడవాలో కూడా తెలియదా కార్మికులకు. ఒక లారీ ఆపి తమ గోడు చెప్పుకోగానే ఎక్కించుకోగలిగినంత మందిని ఎక్కించుకుంటాడు డ్రైవరు. తమ దగ్గర ఇంతే డబ్బుందన్న మోహన్‌రావుతో "నేనడిగానా ఎంతుందని?" అన్న లారీ డ్రైవర్ హీరో కాదా? తగిలిన దెబ్బల్తో, కారుతున్న రక్తంతో ఇరవై కి.మీ. సైకిళ్ళపై ప్రయాణించిన కార్మికులు సంగారెడ్డిలో కలెక్టర్ గారికి మెమోరాండం ఇస్తారు. చాలా సందర్భాల్లానే, చాలా మంది కలెక్టర్ దొరల్లానే ఈ కలెక్టరూ దాన్ని చేర్చాల్సిన చోటికే చేరిస్తే, దాన్ని యేరి "సాఫు చేసుకుని" తన ఇంటిల్లపాదితో చదివించిన బిళ్ళ బంట్రోతూ హీరో కాదా? చివరికి సెక్యూరిటీ ఆఫీసర్ "ఖాన్‌సాబుగాడు". "అబ్దుల్లా చావడానికి కంపెనోడేకారణమనుకుంటున్నారట. కద బే!" అని బెదిరించినా "లే, బాంచన్!! నా కళ్ళతో చూసినా కదా, షాక్కొట్టేసచ్చిండ"ని కవర్ చేసినా "పోసిగాడూ" హీరోనే!

**స్వీకారం**

**కార్మిక గీతం** (నవల)

రచయిత:

**అక్కినేని కుటుంబరావు**

**వెల : 150 /-**

**ప్రతులకు :**

**సి.ఐ.టియు. రాష్ట్ర కమిటి**

1-7-139/44, జమిస్తాన్‌పూర్

ముషీరాబాద్, హైదరాబాద్



ఇందరు హీరోలను ఒకే నవల్లో సమాహారంగా కూర్చారు రచయిత.

రచయిత ఎన్నో సం॥ల అధ్యయనం – కంపెనీల్ని, కార్మికుల్ని, వారి పేదరికాన్ని, పేదరికం వల్ల వచ్చిన బేలతనాన్ని, యాజమాన్యాల దాష్టీకాన్ని, సంఘటితమయ్యేందుకు కార్మికులు చేసే ప్రయత్నాల్ని, వాటిని భగ్నం చేసేందుకు యాజమాన్యాల కుట్రలను ఈ నవల్లో అత్యంత ప్రతిభావంతంగా మలిచారు. ఇన్ని చెప్పి, శివక్రిష్ణ, అమీరుద్దీన్‌లను ఆయన రూపుదిద్దిన తీరు గురించి చెప్పకపోతే ఈ నవలకు మహాపచారం చేసిన వాడినౌతాను. "గీ హెచ్చెస్సారెం మిల్స్ మాకేలవుడోంకో గీ అమీరుద్దీన్ తడాఖా తెల్వదు... గీ అమీరుద్దీన్ గుండాగాళ్ళకు గూండా! అని ఈ సాలేగాండ్లు తెల్సుకుంటారు. తెల్సేట్టు నేన్చేస్తా! మీరు బేఫికర్ గుండుండ్రి!" అంటూ ఉపన్యాసం చెప్పే నాయకులు ఒక్క పటాన్‌చెరు వెంఖర్మ! దేశమంతా ఉంటారు.

సమస్యల మూలాల్ని తాకిన రచయిత ప్రయత్నం అభినందనీయం. పేదరికం కార్మికుల్తో ఎన్ని పనులు చేయిస్తుంది? ఎటువంటి పనులకు పురికొల్పుతుంది? కేబుల్ పరిశ్రమ యాజమాన్యాల "సృజనాత్మక క్వాలిటీ కంట్రోల్ పద్ధతుల"కు చిన్నారి నర్సిమ్మ చేయితెగడం, దాన్ని చూడ్డానికి ఇఎస్ఐ అస్పత్రిలోకి పరిగెత్తుకొచ్చిన లోకయ్య జారిపడి చచ్చిపోవడం వంటి హృదయ విదారకమైన ఘటనలు ఎన్నో బాలయ్య తల్లి చావు ద్వారా ఆచారాలు కార్మికుల్ని ఏ విధంగా అప్పుల పాల్జేస్తున్నాయో రచయిత వివరించారు. మల్లేష్ తన మేనల్లుడు యాద్గిరిని "చదువుకుంటావురా" అని అడిగితే "నువ్వుఏ కొల్వు చూత్తే ఆ కొల్లుచేత్తా" ననడం బాల కార్మికవ్యవస్థ మూలాల్ని తెల్పుతుంది. బొంబాయి కాలనీ, నేతాజీ కాలనీల్లోని అసంఘటిత కార్మికుల జీవితాల్ని రచయిత హృద్యంగా వివరించారు.

చక్రవర్తి, క్రిష్ణచౌదరి, జి.ఎం.గోపాలక్రిష్ణ, సేల్స్ ఆఫీసర్ బ్రహ్మానందం వంటి పాత్రలు ప్రైవేట్ పరిశ్రమల యూనియన్లతో ఏమాత్రం పరిచయమున్న వారికైనా తెలిసినవే. బ్రతిమాలడం, బుజ్జగించడం, జోకొట్టడం, అయితే శివక్రిష్ణ, కాకపోతే అమీరుద్దీన్‌లను ఉపయోగించడం, అన్నీ విఫలమైనపుడు "బ్రహ్మాస్త్రం" ప్రయోగించడం అంచెలంచెలుగా ఈ నవల్లో ప్రత్యక్షమౌతాయి.

ఓ యాభై పేజీలు చదివిన తర్వాత ముగింపు ఎలా ఉందో ముందే చూసెయ్యాలనుకున్నా. కాని తమాయించుకుని పద్ధతిగానే చదివాను. అదే మంచిదైంది. పుస్తకంలో క్రమంగా టెంపో బిల్డప్ చేసిన కుటుంబరావుగారు తన అనుభవాన్ని, సామర్థ్యాన్నంతా రంగరించి చివరి 30,40 పేజీల్లో కుమ్మరించారు. ప్రభుత్వ వర్గ స్వభావాన్ని అక్కడక్కడా విశదీకరించినా, చివరి పేజీల్లో కళ్ళకు కట్టారు. గవర్నమెంట్ తనకు జీతమిస్తున్నా, హెచ్ఎస్ఆర్ఎం గేట్‌కాపలానే తన విద్యుక్తధర్మమనుకునే "సర్కిల్", కార్మికుల మహాజర్లను బుట్టదాఖలు చేసి, యాజమాన్యం కొమ్ముకాసే కలెక్టర్, కార్మికుల సమస్యలు పట్టని కార్మికమంత్రి వీళ్ళందరినీ మనం రోజూ చూస్తాం. రోజూ మన చుట్టూ తిరిగే పాత్రలే ఇవి. సున్నితంగా, సునిశితంగా రాజ్యాంగయంత్ర స్వభావాన్ని బహిర్గతమొనర్చారు కుటుంబరావుగారు. అందుకే ఈ నవల ప్రతి కార్మికుడ్ని ఉత్సాహపరుస్తుంది, ఉద్రేకపరుస్తుంది. రామాయణం చదివిన తర్వాత ఎంత భక్తులకైనా రావణాసురిడిపై అంత కోపం రాదు. కాని ఈ నవల చదివిన తర్వాత పెట్టుబడిదారులపైన యాజమాన్యాలపైన ఏ కార్మికుడికైనా 'వర్గకసి' రగులుతుంది. అదే దీని గొప్పతనం.

"ప్రతిఫలం దక్కాలంటే,<br>
అందరం కలవాలి!<br>
కలిసి నిలవాలి<br>
నిలిచి కొట్లాడాలి!<br>
కొట్లాడి సాధించాలి<br>
సాధించి బ్రతకాలి!!

అందరికోసం అవసరమైతే కొందరు చావాలన్న" రచయిత సందేశం మనకు కర్తవ్యబోధ చేస్తుంది.

చివరిగా ఒక మాట! ఇంత అద్భుత నవలా శిల్పాన్ని చెక్కిన కుటుంబరావు గారు దీనికి కార్మికగీతం కాకుండా మరో పేరు పెట్టుంటే బాగుండేదనిపించింది. రావిశాస్త్రి గారి "పిపీలకం"లా!! ■


నిప్పుల తుఫాన్

ఎస్. గణపతిరావు



**ప్రతులకు:**

**విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు**

C/o పాడ్‌గ్రో కన్సల్టెన్సీ ప్రై.లి.

నెం.12, లేడీ మాధవన్ రోడ్,

మహాలింగపురం, చెన్నై – 600 034,

వెల: రూ॥100/-

# అవినీతి అంతంతోనే అభివృద్ధి సాధ్యం

## సురాజ్య ఉద్యమంలో పాలుపంచుకోవాలి : ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్ధిపేట**

అవినీతిని అంతం చేసినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు చెప్పారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సురాజ్యం ఉద్యమ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులలో ఆశ్రిత పక్షపాతం పెరగడం వల్ల అవినీతి అంతం కావడం లేదన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల బీసీలు ఉన్నత చదువులు చదవలేక వెనుదిరిగిపోయే వాతావరణం ఏర్పడిందని చెప్పారు. సురాజ్యం కోసం ప్రజలందరూ ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పదివేల లోపు ర్యాంకుల విద్యార్థులకే పరిమితం చేయడంతో పేద, బలహీన, వర్గాల వారు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు కొర్తివాడ రాజేందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సు, టీఆర్ఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, టీఆర్ఎస్ నాయకులు బాలరంగం, నముండ్ల రామచంద్రం, లోక్‌సత్తా పార్టీ జిల్లా నేత తుమ్మనపల్లి శ్రీనివాస్, అమ్మన చంద్రారెడ్డి, అలాజీపూర్ లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఎన్‌జీవో భవన్ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమ లక్ష్యాల ప్రజల్లోకి తీసుకెళ్ళండి

## కర్నూలు, కడప, అనంతపురం సురాజ్య కమిటీల శిక్షణలో డా॥జేపి

సురాజ్య ఉద్యమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఉద్యమ కమిటీలు పని చేయాలని డా॥జయప్రకాష్‌నారాయణ్ కోరారు. కర్నూలు, కడప అనంతపురం జిల్లాల నుండి వచ్చిన సురాజ్య ఉద్యమ కమిటీల రిసోర్స్‌పర్సన్‌లకి అక్టోబర్12న కొత్తపేటలోని ప్రజాస్వామ్య శిక్షణా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అందరికీ ఎదిగే అవకాశాల కోసం సురాజ్య ఉద్యమంలో లోక్‌సత్తా పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు డి.వి.వియస్.వర్మ అన్నారు. స్థానిక ప్రభుత్వాలు, హక్కుగా పౌరసేవల చట్టం గురించి లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు వివరించారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, రాజకీయ, పాలనా, ఎన్నికల సంస్కరణల గురించి డా॥పి.భాస్కరరావు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షులు యస్.మనోరమ, రిసోర్స్‌పర్సన్స్ కార్తీక్‌చంద్ర, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో **కర్నూలుజిల్లా**, కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, బనగానపల్లి, పత్తికొండ, నందికొట్కూర్, డోన్, ఆదోని, **కడపజిల్లా** కడప, బద్వేలు, **అనంతపురంజిల్లా** అనంతపురం, గుంతకల్, రాయదుర్గం, కదిరి పట్టణాల నుండి సురాజ్య రిసోర్స్‌పర్సన్స్ హాజరయ్యారు.

# సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ

*సురాజ్యం కోసం సాగిస్తున్న*
*మరో స్వతంత్ర పోరాటంలో*
*నేను భాగస్వామిగా ఉంటాను*
*స్వతంత్ర సమరయోధుల త్యాగఫలాన్ని*
*రాజ్యాంగ విలువలని రక్షించుకోవడం కోసం,*
*అవినీతిని అంతం చేయడం కోసం*
*నా సర్వశక్తుల్ని ఒడ్డుతాను*

*కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా*
*దేశ ఐక్యతని, సమగ్రతని నిరంతరం కాపాడుతాను*
*దేశ నిర్మాణ కార్యక్రమంలో నేను విధిగా పాల్గొంటాను*
*ప్రజాస్వామ్యంలో సురాజ్యం నా జన్మహక్కు*
*దానిని సాధించడం నా విధిగా భావించి*
*ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను*

# సురాజ్య ఉద్యమ సత్యాగ్రహం




నాడు పరాయి పాలన నుండి మనకు స్వరాజ్యం వచ్చింది కానీ, అది కొందరి స్వార్థపరుల కారణంగా స్వాహారాజ్యంగా మారింది. అందుకే స్వరాజ్యంలో అందరూ సమానంగా ఎదగాలంటే అవినీతి లేని పాలన రావాలంటే, వ్యవస్థలో రాజకీయాల్లో సంస్కరణలు రావాలని, లంచాలు లేని ప్రభుత్వ సేవల కోసం, సుపరిపాలన పౌరహక్కుగా, సురాజ్యం మన జన్మహక్కుగా, సురాజ్య ఉద్యమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిస్తూ, గాంధీజయంతి సందర్భంగా నంద్యాల సురాజ్య ఉద్యమ కమిటీ గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహం దగ్గర సత్యాగ్రహం నిర్వహించింది.

**నంద్యాల**

డా॥శౌరిరెడ్డి ప్రజలతో సురాజ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీ.బి.శంకరయ్య, గాంధీజీకి పూలమాల వేసారు. గౌరవ సభ్యులు సి.రాజమోహన్‌రావు శ్రీమతి రహేలమ్మ, కన్వీనర్, ఎస్.ఎ.మజీద్ ప్రధాన కార్యదర్శి ఎమ్.వి. సత్యనారాయణ, ఎన్.ఎ.హమీద్ కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, కె.పుల్లారెడ్డి, ప్రభాకర్, జి.వెంగళరెడ్డి, పి.విజయ్‌కుమార్, ఎస్.పి.దాస్, జి.వి.రమన్ పి.ఎన్.కృష్ణ, బి.నారాయణ, ఆర్.కె. చైతన్య, హరినాథ్‌రెడ్డి, ఆర్.మధుసూధన్, సి.సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ



సురాజ్య ఉద్యమంలో భాగంగా ఈ రోజు వేలాది మంది విద్యార్థులతో సురాజ్య ప్రతిజ్ఞ జరిగింది. నేషనల్ కాలేజీ విద్యార్థుల చేత శ్రీ డా॥ ఇంతయాజ్ అహమ్మద్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీతాళ్లపల్లి వీరయ్య ప్రసంగించారు. మనకు స్వరాజ్యం వచ్చింది కానీ సుపరిపాలన రాలేదు. అందుకే ఇప్పుడు ఈ సురాజ్య ఉద్యమం ప్రారంభమైనది. అవినీతి రహిత సమాజంలో కోసం సాగిస్తున్న

**నంద్యాల**

ఈ కార్యక్రమంలో ఎస్.ఎ. మజీద్ ఎన్.హనుదీ, ఎమ్.వి.సత్యనారాయణ, పి.విజయకుమార్, జి.వెంగళరెడ్డి పాల్గొన్నారు.

# స్వరాజ్యం జన్మహక్కు - సురాజ్యం పౌరహక్కు

## లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు



అవినీతికి కారణం రాజకీయాలని ఎన్నికలలో డబ్బు, మద్యం నిరోధించే ఎన్నికల వ్యవస్థ ద్వారానే పాలన తీరు మారుతుందన్నారు. స్థానిక ప్రభుత్వాలు బలోపేతం చేసి, గల్లీలో సమస్యలకు ఢీల్లీలో పరిష్కారాలుండకూడదన్నారు. లంచాలు, అవినీతి లేని సుపరిపాలన కోసం మనమందరం సురాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలని లోక్‌సత్తా నాయకులు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు.

### డోన్

ఈ సమావేశానికి లోక్‌సత్తా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. లోక్‌సత్తా నాయకులు ఓంకార్ మాట్లాడుతూ అందరికీ ఎదిగే అవకాశాలు కావాలన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి అందరికీ అందినప్పుడే సురాజ్యం సిద్ధిస్తుంది. డోన్ పట్టణ సురాజ్య ఉద్యమంలో తాము పాలు పంచుకుంటామని సి.పి.ఐ. నుండి రంగనాయకులు, బిజెపి ఎస్.వెంకటరమణ, వైఎస్.ఆర్ పార్టీ శ్రీరాములు, టిడిపి పి.ఫణిరాజ్, లోక్‌సత్తా నాయకులు ఆకెపోగు రంజిత్‌కుమార్ డెవిడ్‌లు తెలిపారు.

# సురాజ్య ఉద్యమ కార్యక్రమం

స్థానిక నందికొట్కూరు సురాజ్య కమిటీ ఇన్‌ఛార్జ్ న్యాయవాది ఎ. అనిల్ కుమార్ నాయకత్వంలో గాంధి జయంతి సందర్భంగా అక్టోబర్ 2, 2012 80 మంది సభ్యులతో నందికొట్కూరు పట్టణములోని సర్దార్‌పటేల్ విగ్రహము నుండి ర్యాలీగా కె.జి.రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహము వరకు సభ్యులు వెళ్ళారు. పూలమాల వేసి, సత్యగ్రహం నిర్వహించి, సుపరిపాలనకు ప్రతిజ్ఞ చేశారు.




### నందికొట్కూర్

# అవినీతి పరుల భరతం పట్టే చట్టం రావాలి




**పత్తికొండ**

దేశంలో నెలకొన్న అవినీతిని అంతమొందించడానికి ప్రతి పౌరుడు ఉద్యమబాట పట్టాలని సురాజ్య ఉద్యమ నాయకుడు, లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.ఆనందాచారి ప్రజలకు పిలుపు నిచ్చారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు వందలాదిమంది విద్యార్థులతో కలిసి పట్టణవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ నాలుగుస్తంభాల కూడలిలో మానవహారం నిర్వహించారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు అవినీతిని నిర్మూలించడానికి నడుము బిగించాలన్నారు. సురాజ్య ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొని స్వాహారాజ్యానికి అంతం పలుకుదామని పిలుపునిచ్చారు. సురాజ్యఉద్యమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థిసంఘం నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బాలరాజు, రామచంద్ర, సురేంద్ర, నజీం తదితరులు పాల్గొన్నారు. సురాజ్య ఉద్యమ నాయకులు అశోక్‌కుమార్, తిరుపాల్‌మాదిగ, నాగేంద్ర, ప్రసాద్, మస్తాన్ రంగన్న రామ్మోహన్‌రెడ్డి, హనుమంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులతో పౌరవేదిక రౌండ్‌టేబుల్

**కర్నూలు**

సురాజ్య ఉద్యమంలో భాగంగా ప్రజలలో చట్టాల గురించి అవగాహన కల్పించాలని సీనియర్ న్యాయవాది శ్రీరాములు అన్నారు. కర్నూలులో పౌరవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి న్యాయవాది అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్రశించేతత్వం ప్రజలలో కల్పించి నప్పుడే అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చునని ఆయన అన్నారు. మాతృభాషలో కోర్టు వ్యవహారాలు నడవాలని శ్రీరాములు అన్నారు. టైమ్స్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ సురాజ్య ఉద్యమ లక్ష్యాలను యువత విద్యార్థుల వద్దకు తీసుకెళ్ళడానికి తన సహకారం అందిస్తానన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు సమన్వయకర్తగా వ్యవహరించారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా పేదలకు న్యాయవాదులుగా న్యాయసహాయం చేయడానికి సిద్ధంగా వున్నామని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రేవపాల్, కార్యదర్శి శివశంకర్‌రెడ్డి మాజీ అధ్యక్షులు రంగారవికుమార్, మల్లికార్జున్, రామకృష్ణ, వసంతకుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. లోక్‌సత్తా నాయకులు ఓంకార్, శంకర్, డేవిడ్‌లతో పాటు సురాజ్య ఉద్యమ కమిటీ కర్నూలు అధ్యక్షులు బి.ఎన్.చెట్టి, కోశాధికారి నాగరాజు, పాల్గొన్నారు.

# అవినీతి రహిత పాలనకు యువత ఉద్యమించాలి

## కర్నూలు

అవినీతి లేని పాలన కోసం. అందరికి ఎదిగే అవకాశాల కోసం సురాజ్య సత్యాగ్రహ దీక్షను నగరంలోని కృష్ణదేవరాయల విగ్రహం వద్ద సురాజ్య కమిటీ నాయకులు చేపట్టారు. సురాజ్య సమన్వయ కర్త ఎన్.జి.శంకర్ అధ్యక్షతన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు భీమలించప్ప మాట్లాడుతూ సుపరిపాలన పౌరహక్కు సురాజ్యం మన జన్మ హక్కు అని అన్నారు. గౌరవాధ్యక్షుడు బి.ఎన్. చెట్టి మాట్లాడుతూ అవినీతి లేని పాలన కోసం యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, నాగరాజు, జయన్న డాక్టర్ పెద్దన్న, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమ సత్యాగ్రహం

## కదిరి

గాంధీజీ కలలు కన్న సురాజ్యం కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా స్థానిక వేమారెడ్డి కూడలిలో కదిరి డివిజన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహం చేపట్టి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సురాజ్య ఉద్యమం నాయకులు వీరాస్వామి, హేమంత్, సలీం తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు, ప్రజా సంఘాల వారు పాల్గొన్నారు.

### సురాజ్య ఉద్యమంపై సంతకాల సేకరణ

లోక్‌సత్తా నాయకులు సురాజ్య ఉద్యమం పై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్య, వైద్యం, రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, మహిళా సంక్షేమం గ్రామీణ ప్రాంతాలలో వివిధ సౌకర్యాలు, లంచాలు లేని పౌరసేవల హక్కు చట్టం అవినీతిరహిత పాలన కోసం కొత్త లోకాయుక్త చట్టం కొత్తతరహా ఎన్నికల వ్యవస్థకోసం చట్టం తదితర అంశాలను ప్రజానీకానికి వివరిస్తూ సంతకాల సేకరణను చేపట్టారు.

# సురాజ్యం సాధించే వరకు ఉద్యమం




## రాయదుర్గం

ప్రజలు ఆకాంక్షించే సుపరిపాలన సాధించే వరకు సురాజ్య ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని లోక్‌సత్తా నాయకులు బాబు పేర్కొన్నారు. స్థానిక పాత మునిసిపల్ భవనం ఎదురుగా సామూహిక సత్యాగ్రహం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ బతికే అవకాశం, ఎదిగే అవకాశం కల్పించే రాజకీయం కోసం సురాజ్య ఉద్యమం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు అబ్దుల్లా, లోకేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు గోవర్ధన్, అనిల్, వినోద్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

# సురాజ్యంతోనే దేశ అభివృద్ధి



లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో సురాజ్య ఉద్యమ పోస్టర్‌ను డా॥జె. శ్రీనాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమములో లోక్‌సత్తా నాయకులు వన్నూరప్ప, రాయల్ కొండయ్య పాల్గొన్నారు.

అక్టోబర్ 2న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఆ తర్వాత క్లాక్ టావర్ దగ్గర సత్యాగ్రహం నిర్వహించారు. డా॥ భానుకిరణ్, డా॥ జె. శ్రీనాథ్, ఓంకార్ సురాజ్య ఉద్యమ లక్ష్యాలను వక్తలందరూ ప్రజలకు వివరించారు. సురాజ్య ఉద్యమ కరపత్రాలను ప్రజలకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా॥ గేయానంద, డా॥కొండయ్య, వన్నూరప్ప, ఇస్మాయిల్, నబిరసూల్, సత్యనారాయణ, పాండురంగ, అమర్‌నాథ్, సురేష్ వెంకటలక్ష్మీ, సరస్వతమ్మలు పాల్గొన్నారు.

**అనంతపురం**

# సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ



సురాజ్య ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్దకు వాణివిద్యాని కేతన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వాణి విద్యానికేతన్ వ్యవస్థాపకులు మల్లికార్జున రెడ్డి ఉపాధ్యాయులు, లోక్‌సత్తా నాయకులు మహమ్మద్ గౌస్ ఫోటో స్టూడియో అసోసియేషన్ నాయకులు జంగా సురేంద్ర, కె.క్రిష్ణ, కార్తీక్, మనోహర్, ఇస్మాయిల్, లాయర్ గోపాల్, హాజీ, చంద్రశేఖర్, అనిల్‌లు పాల్గొన్నారు.

**గుంతకల్లు**

# రాజ్యాంగఫలాలు అందరికీ అందాలి

## మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ



శ్రీకాకుళం

శ్రీకాకుళంలో అంబేద్కర్ విగ్రహం వద్ద యువతీ యువకులతో కలసి సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగఫలాలు అందరికీ అందేందుకు రాజకీయాలకతీతంగా సురాజ్య ఉద్యమాన్ని చేపట్టటం హర్షణీయమని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. అవినీతి లేని పాలనకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు సురాజ్య ఉద్యమం అవసరమని లోక్‌సత్తా నాయకులు కొత్తకోట పోలినాయుడు అన్నారు. సురాజ్య కమిటీ అధ్యక్షులు బరాటం కామేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నిర్వహిస్తున్న సురాజ్య ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు పాలుపంచుకోవాలని, ఆ దిశగా, కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు, ఓంశాంతి జిల్లా ప్రతినిధి, కె.ఎల్.నాయుడు, కమిటీ సభ్యులు ఎ.మల్లేశ్వరరావు, బి.గోవిందరావులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమంలో అందరూ పాల్గొనాలి




భీమవరం

అక్టోబర్ 2న భీమవరం తాలూకా ఆఫీసు ఆవరణలో బాపూజీ విగ్రహానికి సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వ ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. సురాజ్య ఉద్యమంలో ప్రజలు, కార్యకర్తలు మరియు స్వచ్ఛంద సంస్థలు పూర్తిగా సహకారం అందించి అవినీతి అంతానికి కృషి చేయవలసిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు అల్లూరి సీతారామరాజు, మంతెన కృష్ణం రాజు, దంతులూరి విజయ బంగార్రాజు, ముగ్దుం అలీ, శ్రీహరి రావు, ఎం.ఎస్.ఎన్. మూర్తి, ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జన చైతన్యంతోనే సురాజ్యం




## చిలకలూరిపేట

చిలకలూరిపేటలో సురాజ్య ఉద్యమ సామూహిక సత్యాగ్రహం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయం, ఎన్నికల వ్యవస్థలను సంస్కరణ చేసినప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలని కోరారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కొల్లా రామ్మోహన్‌రావు, విశ్రాంత ప్రిన్సిపాల్ తోటకూర వెంకటనారాయణ, డాక్టర్ పివి సుబ్బారావు, లోక్‌సత్తా నాయకులు ఎం.భానుప్రసాద్, షేక్ జబ్బార్ మురికిపూడి ప్రసాద్, కామినేని ఆంజనేయులు, ఎం.వెంకట్రావు, సీపీఐ నాయకులు ఆరాధ్యుల రామకృష్ణ, పేలూరి రామారావు, సీపీఎం నాయకులు బొల్లు శంకరరావు, కాంగ్రెస్ నాయకులు నిడమానూరు సాంబశివరావు, టీడీపీ నాయకులు జమాల్‌బాషా, దంతవైద్యులు పేర్ని కృష్ణమోహన్ పాల్గొన్నారు.

# పౌర సేవల హక్కు చట్టం తేవాలి

### లోక్‌సత్తా నాయకులు జె.ఐరామ్మూర్తి

## నాదెండ్ల

పంచాయితీలు, మున్సిపాలిటీలు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు విధులు బదలాయించాలని, పౌరులు కేంద్రంగా ప్రజలు నివసించే చోట పాలన ఉండాలని లోక్‌సత్తా నాయకులు జె. ఐరామ్మూర్తి కోరారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో మంజీరా ఆసుపత్రిలో సురాజ్య ఉద్యమ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రామ్మూర్తి మాట్లాడుతూ యువత సురాజ్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలన్నారు. సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సభ్యులు తోటకూర వెంకట నారాయణ మాట్లాడుతూ లంచాలు, సిఫారసులు లేకుండా నిర్దిష్ట కాలంలో ప్రభుత్వ కార్యాలయాలలో సేవలు అందించాలన్నారు. అందుకోసం పౌరసేవల హక్కు చట్టం తేవాలన్నారు.



### విద్యార్థుల ప్రతిజ్ఞ

సురాజ్య ఉద్యమ కన్వీనర్ మాదాసు భానుప్రసాద్ విద్యార్థులచే సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాదిక్, ఖాదర్, శ్రీనివాసరావు, నరేష్, నివార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాహారాజ్యం పోయి సురాజ్యం రావాలి

## లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ

గజపతినగరం

స్వాహారాజ్యం పోయి సురాజ్యం రావాలని లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ అన్నారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పట్టణంలో భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం సాయి ఫంక్షన్ హాలులో వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సమూల మార్పులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడం ద్వారానే సమాజంలో మార్పును తీసుకుని రావచ్చునని చెప్పారు. నీతివంతంగా ఎన్నికలు జరిగినప్పుడే అవినీతిని అంతం చేయవచ్చునని చెప్పారు. సురాజ్య ఉద్యమం జిల్లా కమిటీ సభ్యుడు పివివి గోపాల రాజు మాట్లాడుతూ రాజకీయాలను అసహ్యహించుకునే కన్నా మార్పుతీసుకుని వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఉత్తమమైన పౌరసమాజం కోసం కృషి చేసినప్పుడే అవినీతిని నిర్మూలించవచ్చని జెవివి జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మణరావు అన్నారు. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందని పాలకులు దృష్టి సారించాలని కోరారు. పోరాటాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని సిపిఐ నాయకులు ఆల్తి అప్పలనాయుడు అన్నారు. లోక్‌సత్తా నాయకులు దేవర ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టిడిపి నాయకులు సామంతుల పైడి రాజు, గజపతినగరం మండలం మాజీ ఉపాధ్యక్షుడు కొల్లా ఓడరాజు, బిజెపి నాయకులు మన్మథరావు, తిరుమల రాజు రామలింగరాజు, వివిఎస్ఆర్ జోగారావు, యువిఎస్ వర్మ పాల్గొన్నారు.

# సురాజ్యంతోనే అవినీతిరహిత సమాజం

## పట్టణ సురాజ్య కమిటీ కన్వీనర్ దామిశెట్టి సత్యనారాయణ



అమలాపురం రౌండ్‌టేబుల్

అవినీతిరహితమైన సమాజం సురాజ్య ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని అమలాపురం సురాజ్య కమిటీ కన్వీనర్ దామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జరిగిన అమలాపురం లోక్‌సత్తా సురాజ్య కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. అవినీతి అంతానికి సురాజ్య ఉద్యమమనే ఆయుధాన్ని ప్రజలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో నీతివంతులను ఎన్నుకోవటం ద్వారా సురాజ్య ఉద్యమానికి ప్రజలు ఊపిరి పోయాలని కోరారు. వి.సూరిబాబు, పి.రాంబాబు, వై.చంటి, ఎన్.శ్రీనివాస్, ఎల్.గణేష్ పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమాన్ని విద్యార్థులే నడిపించాలి

## యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీరాజు

రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా జరుగుతున్న సురాజ్య ఉద్యమాన్ని విద్యార్థులే ముందుకు తీసుకువెళ్లాలని యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పొత్తూరి శివాజీరాజు కోరారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ పీజీ, డిగ్రీ కళాశాలలో లోక్‌సత్తా పార్టీ యువసత్తా ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమం, సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు. శివాజీరాజు మాట్లాడుతూ దేశ భవిత యువత చేతిలోనే ఉందన్నారు. రాష్ట్రంలో లోకాయుక్తను సవరించి తప్పుచేసిన వారికి తక్షణమే శిక్షపడేలా స్వయంప్రతిపత్తి గల బలమైన వ్యవస్థగా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలని... అప్పుడే సురాజ్యం సాధ్యమని పేర్కొన్నారు. గీతం విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్ వర్మ విద్యార్థులకు సహచట్టంపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాబాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విశాఖపట్నం

# అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

## లోక్‌సత్తా నాయకులు వై.డి. రామారావు

అవినీతి నిర్మూలన సురాజ్య నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఆర్‌కే నర్సింహాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ జవాబుదారీతనాన్ని పారదర్శకతను పెంచడం ద్వారా సుపరిపాలనను వీలవుతుందన్నారు. లోక్‌సత్తా నాయకులు వైడి రామారావు, జి. జానకిరామరాజు, శిరిగినీడి నాగభూషణం, అల్లూరి సీతారామరాజు, నల్లం సూర్యచంద్రరావు, మల్లుల వెంకటేశ్వర రావు, పి.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం రౌండ్‌టేబుల్

**సురాజ్య ఉద్యమ కమిటీ** అధ్యక్షుడిగా డాక్టర్ దిరిశాల వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా డాక్టర్ శిరిగినీడి నాగభూషణం, సభ్యులుగా బొలిశెట్టి శ్రీనివాస్, జి. సుగుణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# లోక్‌సత్తాని సంస్థాగతంగా బలోపేతం చెయ్యండి

## పార్టీ సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టండి

### లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గం సమావేశం పిలుపు

అక్టోబర్ 8న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డా॥ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన జరిగింది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చెయ్యాలని అందుకోసం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అన్ని స్థాయిల్లోనూ పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చింది. కొత్త రాజకీయం పట్ల ఆసక్తి గలవారందరిని పార్టీ సభ్యులుగా చేర్చుకోడానికి తగిన ప్రచార కార్యక్రమాలని చేపట్టాలని భావించింది. మండలం, పట్టణం, నియోజకవర్గ స్థాయిల్లో పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రత్యేక ప్రయత్నాలు సాగించాల్సిందిగా పార్టీ శాఖలకు విజ్ఞప్తి చేసింది. జిల్లాస్థాయిలో సురాజ్య ఉద్యమానికి – పార్టీ సభ్యత్వ నమోదుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన జిల్లాలోని విస్తృత సన్నాహక కమిటీలు వివిధ నియోజకవర్గాలకు నిర్దిష్ట బాధ్యతలు తీసుకుని సురాజ్య ఉద్యమాన్ని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించాలి.

డిశంబరు 15 వరకు సురాజ్య ఉద్యమానికి ప్రథమ ప్రాధాన్యతను డిశంబరు 15 నుండి పార్టీ సభ్యత్వ నమోదుకు పూర్తి ప్రాధాన్యతను ఇవ్వాలి.

సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రచారాన్నివ్వటానికి, ప్రోత్సహించటానికి, కార్యాలయంలో సమన్వయం చేయటానికి సభ్యత్వ నమోదు బృందాన్ని రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు చేసింది. అలాగే సురాజ్య ఉద్యమాన్ని సాగించడానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ఒక్కొక్క పట్టణానికి నిర్దిష్టంగా బాధ్యతల్ని అప్పగించింది. ఈ నిర్ణయాల అమలుకు తక్షణం చర్యలు తీసుకోవల్సిందిగా అందరికీ రాష్ట్ర కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ■



# పార్టీ సభ్యత్వ నమోదు సమన్వయ బృందం

లోక్‌సత్తా పార్టీ అంతర్గత ఎన్నికలని ప్రజాస్వామ్యబద్ధంగా జరిపి కొత్త నాయకత్వాన్ని ప్రతిస్థాయిలోను ప్రతిష్ఠించటం అవసరంగా భావించి కొన్ని కీలక నిర్ణయాలని గతంలో తీసుకున్నాం. పార్టీని సభ్యులే నడుపుకోవటం, పోషించుకోవటం, నాయకత్వాన్నివ్వటం ఆచరణలో చూపటం మన ప్రజాస్వామ్య పరిణతికి కీలకం. ఈ విధంగా పదులవేల పౌరుల్ని పార్టీలో భాగస్వాములుగా చేయటం సాధ్యమవుతుంది. ముఖ్యంగా యువత, మహిళలు, మధ్యతరగతి, రైతులు, గ్రామీణ పేదలు రాజకీయాలపట్ల విముఖతని విడనాడి రాజకీయ ప్రక్రియ మన సమిష్టి జీవితంలో భాగంగా గుర్తించేందుకు వీలుగా సభ్యత్వాన్ని అందరికీ అందుబాటులోకి తేవటం అవసరం. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టటానికి, ప్రజలలో ప్రచార కార్యక్రమాలని చేపట్టటానికి ఈ క్రింద పేర్కొన్న నాయకులతో ఒక సమన్వయ బృందాన్ని ఏర్పరచటం జరుగుతున్నది.

ఈ బృందం సభ్యత్వ నమోదు ప్రక్రియను కార్యాలయంలో సమన్వయం చేయటం, సభ్యత్వాన్ని గూర్చి ప్రచారాన్ని చేపట్టటం, జిల్లాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రోత్సహించటం చేస్తారు. ఈ కమిటీ సభ్యులు సంస్థాగత ఎన్నికలకు సంబంధించి వ్యక్తిగత ప్రచారానికి కాని, వ్యతిరేక ప్రచారానికి కాని పూనుకోరాదు. జిల్లాలలో సభ్యత్వనమోదు ప్రక్రియ జిల్లా ఎన్నికల సన్నాహక కమిటీ చూస్తుంది. రాష్ట్రబృందం వారికి సహాయ సహకారాలను అందించటం, సందేహాలను నివృత్తి చేయటం, బాగా సభ్యత్వం చేస్తున్న శాఖలను ప్రోత్సహించటం చేస్తారు.

ఈ బృందం ప్రతి 15 రోజులకొకసారి సభ్యత్వ నమోదు ప్రకియ నివేదికను రాష్ట్ర వర్కింగ్ కమిటీకి అందజేస్తుంది.

## సభ్యత్వ నమోదు సమన్వయ బృందం

| | | |
|---|---|---|
| 1. ఎమ్.బి.ఎన్.వి.వి. ప్రసాద్ కన్వీనర్ | 6. జి. జానకి రామరాజు | 12. ఆనంద్‌రెడ్డి |
| 2. లక్ష్మణ్ బాలాజీ | 7. కె. గీతామూర్తి | 13. దిలీప్ శంకర్ రెడ్డి |
| 3. జి. రాజారెడ్డి | 8. జగన్నాథ రెడ్డి | 14. హైమా సాగి |
| 4. వై.డి. రామారావు | 9. విజయేందర్ రెడ్డి | 15. లక్ష్మీనారాయణ |
| 5. భీశెట్టి బాబ్జీ | 10. ఈద చెన్నయ్య | 16. శ్రీకాంత్ గోడే |
| | 11. పి. శివాజీ | 17. విజయచందర్ |



హైదరాబాద్‌లో ఎం.ఎం.టి.ఎస్. రైళ్ళలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జేపీ

# లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు



## నందికొట్కూర్

పెద్దల ఆలోచన, అనుభవం యువతలోని ఆవేశం కలిస్తేనే లోక్‌సత్తా లక్ష్యాలను ప్రజలలోకి తీసుకెళ్ళవచ్చుని లోక్‌సత్తా కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు అన్నారు. కర్నూలు జిల్లా నందికొట్కూరులో ఆయన లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని అక్టోబర్ 7న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిపై పోరాటంలో కీలెరిగి వాతపెట్టాలని అన్నారు. లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళడానికి, సంస్థాగత నిర్మాణం అవసరమని ఆయన అన్నారు. మొదటిరోజు చేరిన సభ్యులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర లోక్‌సత్తా నాయకులు కె.ఓంకార్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల పార్టీ సభ్యులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. ఈకార్యక్రమంలో యువ న్యాయవాది అనిల్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.శంకర్, ఎమ్.కె.దేవిడ్‌లు పాల్గొన్నారు.



ఎం.ఎం.టి.ఎస్. ట్రైన్‌లో డా॥ జయప్రకాష్ నారాయణ్



కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల సురాజ్య ఉద్యమ కమిటీ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జేపీ



ఆటో డ్రైవర్లతో డా॥ జేపీ



కర్నూలులో పౌరవేదిక ఆధ్వర్యంలో జరిగిన సురాజ్యఉద్యమ సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ న్యాయవాది శ్రీరాములు



కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో జరిగిన సురాజ్యఉద్యమ రౌండ్‌టేబుల్



మెదక్ జిల్లా సిద్ధిపేటలో సురాజ్య ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌రావు



రాజమండ్రిలో సత్యాగ్రహం



రాజమండ్రిలో యువసత్తా కమిటీ సమావేశం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (శంషాబాద్) విద్యార్థులతో డా॥ జేపీ

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad